నవతెలంగాణ 1
మెదక్
శనివారం | 21 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

అజోల్లా పెంపకంతో రైతులకు లాభాలు



నవతెలంగాణ-జహీరాబాద్

అజోల్ల పెంపకంతో రైతులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని కెవికె శాస్త్రవేత్త వి. కైలాష్ అన్నారు. ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి గ్రామంలో గల డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏపీలోని విజయవాడ లయోలా కళాశాల వ్యవసాయ బాలిక విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. అజొల్లా అనేది ఓ రకమైన నాచు మొక్క అన్నారు. నీటిపై తేలియాడుతూ.. వరి పొలాల్లోనూ, లోతులేని జలావాసాల్లోనూ పెరుగుతుంద న్నారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. ప్రోటీన్ ఎక్కువగా వుండటం , కాండభాగం తక్కు వగా ఉండటంతో పశువులు త్వరగా జీర్ణం చేసుకుంటాయన్నారు. కోళ్ళకు మంచి దాణాగా ఉపయోగ పడుతుందన్నారు. అజొల్లాను ఇతరదాణాలతో కలిపికానీ, నేరుగా కానీ ఇవ్వవచ్చు అన్నారు. పందులకు, గొర్రెలకు, మేకలకు, కోళ్ళకు అజోల్లా మంచి దాణాగా ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, డిడిఎస్ కెవికె సిబ్బంది వి.రమేష్, వ్యవసాయ బాలిక విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిమెల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని వెలిమెల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ రామ్ ప్రసాద్ మరియు 18 మంది రెగ్యులర్ టీచర్లను రాష్ట్రంలోని వివిధ మోడల్ స్కూల్స్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా 11 ఏండ్లు పనిచేసి బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కేక్‌లు, జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది బదిలీపై వెళ్తుండడంతో విద్యార్థులు జీర్ణించుకోలేక కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మునిపల్లి



మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గార్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గార్లపల్లి గ్రామానికి చెందిన మన్నే మొగులయ్య(36) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పురుగుల మందు డబ్బాను వెంటపెట్టుకొని గ్రామ శివారులోని పొలానికి వెళ్ళాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి.. భార్య ప్రమీలకు ఫోన్ చేసి పురుగుల మందు తాగినట్టు చెప్పాడు. దాంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని అతన్ని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పారిశుధ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

నవతెలంగాణ జహీరాబాద్



ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. ప్రతీ ఫ్రైడే డ్రైడేగా పాటించి పారిశుధ్యంలో పాల్గొనాలని ఎంపీడీవో వెంకట్ రెడ్డి సూచించారు. జహీరాబాద్ మండలంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మల్చెల్లమ్మ గ్రామంలో ఎంపీడీవోపాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని జిన్నారం మాజీ ఎంపీపీ కొలను రవీందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి శుక్రవారం నిర్వహించిన శాంతిర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో శాంతిపూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని కొనియాడార. ఈ కార్యక్రమంలో బొల్లారం సిఐ గంగాధర్, షాబాద్, ఆజాం ఖాన్, ఖలీల్, ఖాసిం పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతిక వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-గుమ్మడిదల



స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బొంతపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక, వ్యాసరచన, డ్రామా తదితర పోటీలను ఎంపీడీవో ఉమాదేవి, పిజిహెచ్ ఎం.రాంబాబుల సమక్షంలో పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి పరిశుభ్రత అలవర్చుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన డ్రామా తదితర కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఉపాధ్యాయులు విశ్వనాథ్, భాస్కర్ రావు, సపత్, శ్రీనివాస్, విజయ,సత్యశ్రీ, ఊర్మిళ, జ్యోతి, శ్రీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ మాట నిలబెట్టుకునే ప్రభుత్వం

నవతెలంగాణ-జోగిపేట



కాంగ్రెస్ మాట నిలబెట్టుకునే ప్రభుత్వమని అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలను వార్డులో శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే అత్తర్ బేగంకు మంజూరైన ఎల్పిజి రూ.500 మంజూరు పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం అభయహస్తం కార్యక్రమం ద్వారా కేవలం రూ.500లకే యల్.పి.జి. సిలిండరును అందించాలనే లక్ష్యంతో మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారత, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి పై ఆర్థిక భారం తగ్గించడం మరియు వారికి కాలుష్య రహిత వంట మాధ్యమాన్ని అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రసాద్, ఇఫతాఖర్,ఖయ్యూమ్, ఆర్‌పి అనిత, శాంత పాల్గొన్నారు.

జర్నలిస్ట్ అన్వర్ హుస్సేన్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-హత్నూర



జర్నలిస్ట్ హౌసింగ్ అండ్ హౌస్ సైట్ రాష్ట్ర కమిటీ మెంబర్ గా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టు అన్వర్ హుస్సేన్‌ను హత్నూర విలేకరులతో పాటు కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ సమన్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. ఇంటి స్థలాలతో పాటు నిర్మాణానికి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు కేటాయించడానికి ముందు వరుసలో ఉంటానని హామీ ఇచ్చారు. మండలంలో పనిచేస్తున్న ప్రతి విలేఖరికి అక్రిడేషన్ వచ్చే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు దుర్గయ్య, ఆంజనేయులు, వెంకటేష్ గౌడ్, ప్రభాకర్, వీరేశం బిక్షపతి పోచ్చా గౌడ్ యాదగిరి, కరీముద్దీన్, గోపాల్, రమేష్, అబ్దుల్లా, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, వెంకటేష్, శ్రీకాంత్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసి స్వచ్ఛ ఆటోలో వేయాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



తడి, పొడి చెత్త వేరు చేసి స్వచ్ఛ ఆటోలో వేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి 2024లో భాగంగా కమిషనర్ ఆదేశాల మేరకు 4వ వార్డులో తడి, పొడి, హానికర చెత్తను వేరు వేరుగా చేసి స్వచ్ఛ ఆటోకి ఇవ్వాలని వార్డు ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. తదనంతరం కూరగాయల మార్కెట్‌లో ఎస్‌హెచ్‌జి గ్రూప్ మెంబెర్స్‌తో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ధన లక్ష్మి ,డ్వాక్రా గ్రూపు సభ్యులు , సూపర్ వైజర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 16 మంది రిమాండ్



- మొత్తం 31మందిపై కేసు నమోదు
- మిగతా 15 మంది అప్ స్టాండింగ్
- త్వరలోనే మిగతా వారిని పట్టుకుంటాం
- తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్: తూప్రాన్ పోలీస్ సబ్ డివిజనల్ పరిధిలోని మనోహరాబాద్ మండలం గౌతోజిగూడలో గ్రామ బహిష్కరణ ఘటన కేసులో గురువారం ముగ్గురిని, శుక్రవారం 13 మందిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో మొత్తం 16 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకట్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. గౌతోజిగూడ గ్రామంలో డప్పు కొట్టమంటే కొట్టడంలేదని ఓ దళిత కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసిన ఘటనలో మొత్తం 31 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా, శుక్రవారం మొత్తం 16 మందికి మెడికల్ టెస్టులు నిర్వహించిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మిగతా 15 మంది అప్ స్టాండింగ్‌లో ఉన్నారని త్వరలోనే మిగతా వారిని అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తామని డీఎస్పీ వెంకటరెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు.

పేరుకే పెద్ద ప్రాజెక్టు

- సింగూర్ ప్రాజెక్టు వద్ద మౌలిక వసతులు కరువు
- పర్యాటకులకు తప్పని తిప్పలు
- మందుబాబులకు అడ్డాగా సింగూరు పార్కు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు







నవతెలంగాణ-పుల్కల్

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే సింగూరు ప్రాజెక్ట్ అతిపెద్దది. నేడు ఈ ప్రాజెక్టు జలకళతో పరవాళ్ళు తొక్కుతున్నది. దాంతో ఆ ప్రాజెక్టును చూసేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుండి భారీ సంఖ్యలో వేలమంది పర్యాటకులు ప్రాజెక్టు వద్దకు వస్తున్నారు. అయితే ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పర్యాటకుల కోసం ప్రాజెక్టు దిగువ భాగంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో గత 15 ఏండ్ల క్రితం పార్కును ఏర్పాటు చేశారు. కానీ ప్రాజెక్టులోకి ఎక్కువ నీరు రావడంతో ఒక్కసారిగా 10 గేట్లు ఎత్తడంతో ఆ పార్కు పూర్తిగా నీటిలో కొట్టుకుపోయిం ది. ప్రాజెక్టుపై రాత్రి వేళల్లో లైట్లు వెలిగేందుకు స్తంభాలను ఏర్పాటు చేసినప్పటికీ ఏ ఒక్క విద్యుత్ దీపం వెలగట్లేదు. పేరుకే పెద్ద ప్రాజెక్టు అయినప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు మారినా సింగూరు ప్రాజెక్టు రూపురేఖలు మాత్రం మరణం లేదు. ప్రాజెక్టు నిర్మించి సుమారు 45 ఏండ్లు దాటినా.. ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులకు ఎలాంటి వసతులు కల్పించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వసతులు లేనప్పటికీ.. పార్కులో ఒక్కో వ్యక్తి నుంచి సుమారు 20 నుంచి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మందుబాబులకు రూ.500 నుంచి 2000 వరకు వసూలు చేసి వారికి పార్కులోకి అనుమతిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరిగినా కూడా ప్రాజెక్ట్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజన్న స్పందించి ప్రాజెక్టు వద్ద ఉన్న పార్కులో కనీస వసతులు కల్పించడానికి కృషి చేయాలన్నారు.

వాహనాల పార్కింగ్ లేక ఇబ్బందులు..

ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన పర్యాటకులకు వాహనాలను నిలుపుకోవడానికి స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ ఎక్కువై.. కిలోమీటర్ పోవడానికి కూడా గంట సమయం పడుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. దానిని నియంత్రించడానికి కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉన్నత ప్రమాణాలను చేరుకోవడానికి స్థిరమైన శిక్షణ అవసరం

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఉన్నత ప్రమాణాలను చేరుకోవడానికి స్థిరమైన శిక్షణ అవసరమని కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని ఎన్‌సీసీ యూనిట్‌ను నిజామాబాద్‌లోని 33(తెలంగాణ) బెటాలియన్ ప్రధాన కార్యాలయం కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం 33 (తెలంగాణ) బెటాలియన్, సంగారెడ్డి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ సిరియాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి. మధుసూదనరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కల్నల్ సునీల్ అబ్రహం గీతం ఎన్ సీసీ క్యాడెట్లతో ముఖాముఖి చర్చించడంతో పాటు, వారి అత్యుత్తమ పనితీరును ప్రశంసించారు. ఉన్నత ప్రమాణాలను చేరుకోవడానికి స్థిరమైన శిక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సామాజిక సేవకు మాత్రమే కాకుండా దేశ నిర్మాణంలో కూడా ఇతోధికంగా సహకరిస్తున్న ఎన్‌సీసీ ప్రయోజనాలను సహ-పాఠ్య కార్యకలాపంగా అభివర్ణించారు. ఎన్‌సీసీ సర్టిఫికేట్ కలిగి ఉండడం వల్ల విద్యార్థి బయోడేటా విలువ గణనీయంగా పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలను 30 శాతం పెంచు తుందని, ప్రభుత్వ ప్రభుత్వరంగ సంస్థలలో వెయిటేజిని అందజేస్తుందని క్యాడెట్‌లకు కల్నల్ వివరించారు. సాయుధ దళాలలో ప్రత్యేక ప్రవేశ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్ సీసీ క్యాడెట్లకు పోలీసు ఉద్యోగాలలో ఐదు శాతం వెయిటేజీని మంజూరు చేస్తున్నట్టు కల్నల్ సునీల్ వెల్లడించారు. ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ శిబిరాలలో పాల్గొనడానికి ఎంపికయిన పలువురు గీతం ఎన్ సీసీ క్యాడెట్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. మహిత కొండూరి యువత మార్పిడి కార్యక్రమం-2024-25కు ఎంపికై నేపాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. అబ్దుల్ హదీ పరీక్, నికేత్ సుందరాశెట్టి, మహితా కొండూరి, శిఖా సింగ్ రాథోడ్ లు సర్వీస్ సెలక్షన్ బోర్డ్ శిక్షణా కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఎస్.రిత్విక, కె.కీర్తలు లక్షద్వీప్, కాకినాడలలో నిర్వహించనున్న ప్రత్యేక జాతీ య సమగ్రత శిబిరానికి ఎంపికయ్యారు. ముకుల్ అస్సాంలోని స్పెషల్ ఇంటిగ్రేటెడ్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. గణతంత్ర వేడుకలలో పాల్గొనే వారి తుది విడత ఎంపిక చేయడం కోసం నిజామాబాద్‌లో నిర్వహించనున్న క్యాంపునకు గోవిందు లిఖిత, ధరణికోట జీశాంతిక, శౌర్య కొండపల్లి ఎంపికయ్యారు. తొలుత, కల్నల్ సునీల్ అబ్రహంను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డి వి ఎస్ ఆర్ వర్మ, ఎన్.సిసి అధికారి ఎస్.అజయ్ కుమార్‌లు స్వాగతించి, సత్కరించారు.

బస్సుల కోసం రహదారిపై ధర్నా

నవతెలంగాణ-జిన్నారం



మండలంలోని సోలకపల్లి, శివానగర్, పటాన్చెరువు మీదుగా నర్సాపూర్ వరకు.. మండల కేంద్రమైన జిన్నారం వరకు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు నర్సాపూర్ బస్టాండ్ ఎదుట మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిన్నారం మండలానికి బస్సులు నడపరా? ఏళ్ల తరబడిగా సమస్యను పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పటాన్చెరు, కొడకంచి, మాదారం, జిన్నారం మీదుగా బొంతపల్లికమాన్ వరకు అలాగే పటాన్చెరు, శివానగర్, సోలక్పల్లి మీదుగా బొంతపల్లి కమాన్ వరకు బీహెచ్ఎల్ డిపో బస్సులు నడిచాయని.. కానీ నర్సాపూర్ డిపో అధికారులు తుతూమంత్రంగా కొన్ని నెలలు బస్సులు నడిపి మొత్తానికే బంద్ చేశారన్నారు. దాంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. ఈ నిరసనకు నర్సాపూర్ బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ మురళి యాదవ్ సంఘీభావం ప్రకటించారు. బస్సులు నడపని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు సోలక్‌పల్లి కొత్తకాపు జగన్ రెడ్డి, మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా నేత రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజు, ఎల్లమ్మ గూడెం మాజీ సర్పంచ్ సత్యనా రాయణ, నాగారం యాదగిరి యాదవ్, జిన్నారం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి

- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



సంక్షేమ హాస్టల్స్, గురుకుల విద్యార్థుల మెస్, కాస్మోటిక్ ఛార్జీలు వెంటనే పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 23న ఛలో సంక్షేమ భవన్‌ను జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డి సుందరయ్య భవన్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇస్తున్న మెస్ ఛార్జీలు పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోక హాస్టల్ విద్యార్థులు అర్థాకలితో ఉంటున్నారన్నారు. గత ఆరు నెలల నుంచి మెస్ ఛార్జీలు బకాయి ఉంటున్నాయని వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా మెస్, కాస్మోటిక్ ఛార్జెస్ డబ్బులు ప్రతినెలా ఇవ్వాలన్నారు. మెనూ పూర్తిస్థాయిలో అమలు కావాలంటే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డబ్బులు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఉంటున్న చాలా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని.. అన్ని హంగులతో ఆ భవనాలు నిర్మించాలన్నారు. డీప హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ కింద ప్రతినెలా రూ.2000 ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ప్రతి దళిత కుటుంబానికి అంబేద్కర్ అభయహస్తం పేరుతో రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందని వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ ఈనెల 23న హైదరాబాదులోని సంక్షేమ భవనం ముందు ధర్నా చేపట్టినట్టు తెలిపారు. ఈ ధర్నాలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి. అశోక్ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, జిల్లా నాయకులు సుదర్శన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీ.వో 60 ప్రకారం వేతనాలివ్వాలి

- ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు గత 17 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా.. కనీస వేతనాల్లేక, రెగ్యులరైజేషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాబట్టి వారిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆరోగ్యం మిత్రులకు జీతభత్యాలు ఔట్సోర్సింగ్ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలతో పాటు పిఎడిఏ సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. సమస్యలు పరిష్కరించాలని లేని యెడల రాష్ట్రవ్యాప్త పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, అశోక్, ఉద్యోగులు గాయత్రి, చంద్రకళ, వినోద్, నాగరాజు, సత్యనారాయణ, రమేష్, నర్సింలు, రవీందర్, శ్యామ్ , కైరిన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- సెప్టెంబర్ 23న దేశవ్యాప్త బ్లాక్ డే పాటిద్దాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-హత్నూర



కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపు నిచ్చారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్‌లో సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్లాక్ డే లో భాగంగా జిల్లా, మండల, పట్టణ పారిశ్రామిక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గ హక్కులను విదేశీ స్వదేశీ పెట్టుబడుదాలకు కట్టబెట్టిందన్నారు. దాంతో కార్మికవర్గానికి తీవ్రనష్టం జరగనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్లో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపకుండా యాజమాన్యాల కొమ్ము కాసిందన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు, పని గంటలు, అక్రమ తొలగింపులు, మహిళా కార్మిక హక్కులు, ఆరోగ్యం, సంక్షేమం తదితర అనేక ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఈ లేబర్‌కోడ్‌లను నిరసిస్తూ సెప్టెంబర్ 23న దేశవ్యాప్త బ్లాక్ డే లో కార్మికులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విద్యాసాగర్ వివిధ యూనియన్ల నాయకులు షబ్బీర్, వీరేశం, రాజు, గోపాల్, సంగమేశ్, నర్సింలు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

శిశువు అపహరణకు యత్నించిన దుండగులు

- పట్టుకొని చితకబాదిన పల్లె పహాడ్ గ్రామస్తులు
- నిందితులను అదుపులోకి తీసుకున్న గజ్వేల్ పోలీసులు
- భయం గుపెట్లో ఆర్‌అండ్ ఆర్ కాలనీ వాసులు.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



అభం శుభం తెలియని 21రోజుల వయసున్న శిశువులు అపహరించే యత్నం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లె పహాడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పల్లె పహాడ్ కు చెందిన సింగరమైన యాదయ్య కుమార్తె భార్గవి 21 రోజుల క్రితం మగ శిశువును ప్రసవించింది. గురువారం శిశువుకు నామకరణ కార్యక్రమం నిర్వహించి యాదయ్య కుటుంబం విందు చేసుకున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న సమయంలోనే గుర్తుతెలియని ముగ్గురు పురుషులు, ఒక మహిళ యాదయ్య ఇంటి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఇంట్లో చొరబడ్డారు. శిశువును దొంగిలించి తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా, కుటుంబ సభ్యులు బెదిరించడంతో పారిపోవడానికి ప్రయత్నించారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడం తో స్థానికులు అంతా వచ్చి దొంగల ను పట్టుకుని చితకబాదారు. స్థానికు లు గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సైదా సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా తరచు ఆర్ అండ్ ఆర్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతున్నారని కాలనీవాసులు వాపోయారు. ఆరు బయట పార్క్ చేసిన బైకులు వస్తువులను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. ఏదైనా సంఘటన జరిగితే తప్ప పోలీసులు అటువైపు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ముగ్గురు వ్యక్తులు పాపను అపహరించేందుకు ఎక్కించారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటన పునరుతం కాకుండా పోలీసులు కాలనీ పైన ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ సైదాను కోరారు. అనంతరం సీఐ సైదా మాట్లాడుతూ అపరిచితులు తిరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే సమాచారం అందించాల న్నారు. ఎలాంటి వారినైనా తప్పు చేశారని తెలిస్తే శిక్షించేందుకు చట్టం ఉందని గుర్తుకు చేశారు. చట్టాన్ని ఎవరి చేతిలోకి తీసుకోవద్దని తప్పు చేసిన వారిని తమకు అప్పజెప్పితే విచారించి శిక్ష అమలు చేసే విధంగా పై అధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

డాకూర్ రహదారిలో రోడ్డు ప్రమాదం

- రెండు బైక్‌లు ఢీ..
- ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు

నవతెలంగాణ-జోగిపేట



రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అందోలు మండలం డాకూరు రహదారిపై శుక్రవారం జరిగింది. ఏఎస్ఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన చెంద్రయ్య(60), మాణెమ్మ దంపతులు టీవీఎస్ ఎక్సల్ వాహనంపై అందోలు మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి బంధువుల ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సంగుపేట వద్ద సర్వీసు రోడ్డు గుండా వెళ్లాల్సి ఉండగా బ్రిడ్జీ పైకి ఎక్కి కొంతదూరం ప్రయాణించి.. రాంగ్‌రూట్‌లో వెళ్తున్నామని గ్రహించి వెంటనే రోడ్డుపక్కన బైక్ నిలిపారు. ఈ క్రమంలో అదేవైపు గా హైద్రాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు వస్తున్న మరో బైక్ వారి బైక్‌ను ఢీ కొట్టింది. దాం తో చంద్రయ్యకు తీవ్ర గాయాల వ్వగా, అతని భార్య మణెమ్మతో పాటు మరో బైక్‌పై ఉన్న విజయ్, అతని భార్య నవ్య, వారి చిన్నారులు శిరీష, ఆర్యన్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది జోగిపేట ప్రభుత్వ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించగా ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు మల్లేశం ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్‌కు ఒకరోజు శిక్షణ విజయవంతం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఒక్కరోజు శిక్షణా తరగతులు విజయవంతం అయ్యాయి. ఈ ఒక్కరోజు శిక్షణలో గోడెక్, ఫ్లాష్, కెనాన్ కెమెరా గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి, కంది, సదాశివపెట్, పుల్కల్, చౌటకూర్ మండలాల నుంచి అధికసంఖ్యలో ఫోటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సంగారెడ్డి మండల అధ్యక్షులు బాలాజి సతీష్, ప్రధానకార్యదర్శి భూ మయ్య కోశాధికారి మురళీ, జిల్లా అధ్యక్షులు సప్పల శ్రీని వాసు, ప్రేమ్ సాగర్,తులసి నర్శిములు, రవి, అను సురేష్, రాజు, ఆంజనేయులు, యాదగిరి, భరత్ పాల్గొన్నారు.

రూ.12.10లక్షలు పలికిన లడ్డూ వేలం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వేలం పాటను శుక్రవారం నిర్వహించారు గ్రామ పెద్దలు పుల్లగూర్ల ఎల్లారెడ్డి 12 లక్షల పదివేల రూపాయలకు దక్కించుకున్నారు బొల్లారంలోని అన్ని రాజకీయ పార్టీలు చెందిన నాయకులు పాల్గొన్నారు లడ్డూను దక్కించుకున్న ఎల్లారెడ్డి మాట్లాడుతూ వేలంపాటలో లడ్డూని సొంతం చేసుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు అనంతరం వినాయకుని మణి హారాన్ని 6.8 లక్షలకు మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి గారి అనిల్ కుమార్ రెడ్డి దక్కించుకున్నారు ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఓటరు నమోదు రాష్ట్ర పరిశీలకుల పర్యటన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ప్రత్యేక ఓటర్ నమోదు సీఈఓ రాష్ట్ర కార్యాలయం నుంచి పరిశీలకులు శ్రీకాంత్‌రావు, నీలిమలు శుక్రవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించారు. బీఎల్‌ఓల ద్వారా చేపట్టిన హౌస్ టు హౌస్ సర్వే తీరును పరిశీలించారు. ఓటర్ నమోదు, మార్పులు చేర్పులు, డెలిషన్ ప్రక్రియ గూర్చి కార్యాలయంలో సంబంధిత రిపోర్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్వోలతో జరిపిన మీటింగ్‌లో గౌరవ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. అశోక్ చక్రవర్తి సమక్షంలో తగిన సూచనలు అందజేశారు. స్థానిక పట్టణంలో గల పోలింగ్ కేంద్రం 167ను తనిఖీ చేశారు. దాని పరిధిలోని ఒక ఇంటిలో హెచ్ టు హెచ్ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, నాయబ్ తహసీల్దార్ రాజు పటేల్, మండల ఆర్ఐ, సూపర్వైజర్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రేజింతల్ గ్రామపంచాయతీని సందర్శించిన ఎంపీడీవో

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రేజింతల్ గ్రామపంచాయతీని ఎంపీడీవో రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. వైద్య, అంగన్వాడీ, పలు అభివృద్ధి అంశాలపై సెక్రటరీ, గ్రామస్తులతో కలిసి సమీక్షా సమావేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ పార్టీలకు ఇబ్బంది లేకుండా ఓటర్ లిస్టు సమగ్రంగా ఉండాలని స్పష్టంగా చెప్పారు. పంచాయతీ అధికారులు, బీఎల్వోలు అందరి సమన్వయంతో ఓటర్ల జాబితా సకాలంలో పూర్తి చేయాలన్నారు. మృతి చెందిన, వివాహం అయిన ఓటర్ల తొలగింపు, పన్ను వసూలు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఇంటి పన్ను వసూలుకు పంచాయతీ సెక్రటరీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు . అందరి సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ సెక్రెటరీ అరుణ జ్యోతి, ఏఎన్ఎం పుణ్యవతి, నాయకులు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివా స్‌రెడ్డి,తిరుపతిరెడ్డి, మైముద్, మల్ రెడ్డి, మెశప్ప, అంగన్వాడీ, ఆశా వర్కర్లు ఉన్నారు.

మాతాశిశు పౌష్టికాహార పోషణ మాసోత్సవ పక్షోత్సవాలు



నవతెలంగాణ-గుమ్మడిదల

మాతా శిశు పోషణ మాసాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మండల మహిళా సమైక్య భవనంలో గర్భిణులకు పౌష్టికాఆర పోషణ మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఉమాదేవి హాజరై మాట్లాడుతూ.. ఆకుకూరల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని.. కాబట్టి చిన్నారులకు తినిపించాలని సూచించారు. చిన్నారులు అనారోగ్యానికి గురికాకుండా చేతులు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఐకెపి ఎపిఎం శివకుమార్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి ఆదేశాలతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాడిపశువులకి, పెరటి కోళ్ల పెంపకానికి మదర్ యూనిట్స్ మైక్రో ఎంటర్ప్రైజెస్ సంస్థ ద్వారా వివిధ వ్యాపారాలు చేసుకునే వారికి రుణాలు అందజేస్తూ నెలవారీగా సమీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి కవిత కోశాధికారి పూజ వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు సీసీలు ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

క్రీడా దుస్తులు పంపిణీ చేసిన మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-సదాశివపేట



జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మండలంలోని నిజాంపురం పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి తన సొంత డబ్బుతో క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబడ్డీ, వాలీబాల్, కోకోలో జిల్లా స్థాయిలో ఎన్నికైన విద్యార్థులకు సొంత డబ్బుతో డ్రెస్సులు ఇవ్వడం సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో కూడా క్రీడాకారులు మరింతగా రాణించి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా ప్రతిభ చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణాకర్, సొసైటీ డైరెక్టర్ విఠల్ రెడ్డి, రమేష్, రాజశేఖర్ రెడ్డి, వార్డ్ మెంబర్ ప్రభాకర్, ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మండల పరిధిలోని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడేలో భాగంగా స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించినట్టు మండల స్పెషల్ ఆఫీసర్ బలరామ్, ఎంపీడీఓ మహేష్‌రావులు తెలిపారు. మండలంలోని ఎనకపల్లి తాండాలో చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని.. చెత్త చెదారం రోడ్డుపై వేయకూడదని.. సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింహా రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దిశా కమిటీ మెంబర్‌గా ప్రకాష్ రాథోడ్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి దిశా కమిటీ మెంబర్గా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రకాష్ రాథోడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాథోడ్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన ఎంపీ సురేష్ షెట్కార్‌కు, ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

జహీరాబాద్‌లో అక్రమ కట్టడాలను కూల్చి వేయాలి



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని అక్రమ కట్టడాలను హైడ్రా ద్వారా కూల్చి వేయాలని.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి పెద్దపెద్ద నాళాల పై ఇండ్లు నిర్మించిన వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సిములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా కొందరు బడా నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వంలోకి మారుతూ.. వారి అక్రమ సంపాదనలను కాపాడుకుంటున్నారన్నారు. అసైన్డ్ భూముల నుంచి వారి వెంచర్లకు దార్లు వేస్తున్నారన్నారు. నాళాలను కబ్జా చేసి.. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అలాంటి వారందరిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. హైడ్రా ద్వారా అక్రమ కట్టడాలను కూల్చాలని డిమాండ్ చేశారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సైతం పంపిస్తామన్నారు.

కాంట్రాక్ట్ హమాలీ కార్మికులకు గ్రాడ్యుటి చెక్కులు అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఏసియన్ పెయింట్ కాంట్రాక్టు హమాలీ కార్మికులకు గ్రాడ్యుటి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్టియూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలో సర్వీసు పూర్తి చేసుకొని రిటైర్మెంట్ అయిన 12 ఏండ్ల సర్వీస్ గల హమాలీ కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ.84 వేల గ్రాడ్యుటి.. 9 మందికి కలిపి కాంట్రాక్టు హమాలీ కార్మికులకు సుమారు రూ.5 లక్షల 70 వేల చెక్కులు ఇప్పించామన్నారు. అఖిలభారత ఐఎన్టీయూసీ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవ రెడ్డి తరఫున ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి కాంట్రాక్టు సూపర్వైజర్ అమర్నాథ్‌రెడ్డి, హమలి కార్మిక సంఘం నాయకులు మల్లేష్, రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బల్బులు పెడుతుండగా కరెంట్ సరఫరా.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-జోగిపేట

స్తంభాలకు బల్బులు పెడుతుండగా.. కరెంట్ సరఫరా కావడంతో షాక్ కొట్టి ఓ వ్యక్తి అకడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని తలెల్మా గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తున్న మన్నే లక్ష్మయ్య (25)తో గ్రామ కార్యదర్శి ఆశాలత శుక్రవారం గ్రామంలో బల్బులు వేయిస్తున్నది. లక్ష్మయ్య బల్బులు పెడుతుండగా అకస్మాత్తుగా కరెంటు సరఫరా కావడంతో కరెంట్ షాక్ గురై తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య మన్నె ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎంపీడీవో రాజేష్‌కుమార్, ఎంపీఓ అశోక్, కార్యదర్శి ఆశాలతాలు చెప్పారు.

తల్లిబిడ్డల సంక్షేమం కోసం పోషణ అభియాన్

- కిశోర బాలికల రక్తహీనత నిర్మూలన చర్యలు చేపట్టాలి
- గర్భిణీ స్త్రీలకు ముర్రుపాల ఆవశ్యకత మీద అవగాహన కల్పించాలి
- కలెక్టర్ కాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



పోషణ్‌అభియాన్ కార్యక్రమంలో తల్లి, బిడ్డలకు సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టరేట్ ఆడిటో రియంలో మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలకు పోషకాహారం కోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకునేలా వారిని చైతన్య పరచాలన్నారు. జిల్లాలో ఈ నెల ఒకటి నుండి 30 వరకు నిర్వహిస్తున్న జాతీయ పోషణ మాసంలో సిబ్బంది, ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల పోషణ, పోషకాహారం, పరిశుభ్రతపై వివరించాలన్నారు. జిల్లాలోని 1504 అంగన్వాడి కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని, తల్లి, బిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రోజు గర్భి ణీలకు, బాలింతలు, పిల్లలకు పాలు, గుడ్లు, పోషక విలువలు కలిగిన హారాన్ని అందించాలన్నారు. అంగన్వాడి, ఆశ, వైద్య సిబ్బంది సమ న్వయంతో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పోషణ, ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు ముర్రుపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించేలాచూడాలన్నారు. ముర్రుపాలు తాపడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు, రోగనిరోధక శక్తి పెంపొందించుకుంటారన్నారు. పోషణ లోపం కలిగిన పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని ఆరోగ్యవంతులుగా మార్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి చిన్నారి వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా పోషక ఆహారాన్ని అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనత లోపం లేకుండా గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషణ విలువలు ఉన్న ఆహారం తీసుకోవడంతో పాటు రాగులు, జొన్నలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటవి తీసుకోవాలని సూచించారు. వాటిపై అవగాహన కల్పించాలన్నారు. అంగ న్వాడి కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని మహిళా శిశు సంక్షేమ అధికారిణి ని ఆదేశించారు.అంగన్వాడి కేంద్రాలలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్వాడి, వైద్య శాఖ సిబ్బందిచే కలెక్టర్ పోషణ అభియాన్ కార్యక్రమం అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, 7 వ జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, అంగన్వాడి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళా, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ తల్లి బిడ్డల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు వివిధ అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శించిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి డా. 'గాయత్రీ దేవి , జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మెప్మా పిడి గీత, సిడిపిఓలు, సూపర్వైజర్లు, అధికారులు, అంగన్వాడి సిబ్బంది, గర్భిణీలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంచాలకులు, వికలాంగుల వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారతశాఖ ఆదేశాలతో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం 2024 సందర్భంగా ప్రముఖ/ అత్యుత్తమ వయోవృద్ధులు నిరుపేద సీనియర్ సిటిజన్లకు (విశిష్ట సేవలందించడంలో నిమగ్నమైన అర్హులైన సంస్థ లకు) రాష్ట్రస్థాయి అవార్డులు అందజేయడం కోసం అర్హులైన వయోవృద్ధులు సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు వికలాంగుల వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి తెలిపారు. పూర్తి వివరాలు(అవార్డు క్యాటగిరిలు, సబ్ క్యాటగిరిలు అర్హతలు, దరఖాస్తు విధానం, క్యాలండర్ ఆఫ్ యాక్టివిటీస్, అప్లికేషన్ నమూనా) లాంటివి (www.wdsc.telangana.gov.in) వెబ్‌సైట్‌లో పొంద వచ్చు అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు సంబంధిత ధ్రువ పత్రాలు జతపరిచి ఈనెల 25వ తేదీ సాయంత్రం 05:00 గంటల లోపుగా హైదరాబాద్‌లోని వికలాంగుల వయో వృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖకు అందేలా సమర్పించాలన్నారు. ఏదైనా ఇతర వివరాలకు 9652394751, 040-245590480 సంప్రదించా లన్నారు. కాగా నిర్ణీత తేదీలోగా ఒరిజినల్ దరఖాస్తు ఫారాలను పైన తెలిపిన కార్యాలయంలో సమర్పించని యెడల.. ఆ దరఖాస్తులు తిరస్కరించబడుతాయన్నారు.

వేణుగోపాల స్వామిని అభినందించిన ఎస్పీ

నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ రాష్ట్ర విశ్రాంత పోలీసు అధికారుల సంఘానికి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన విశ్రాంత ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాల స్వామిని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత పోలీసు అధికారుల సంఘానికి, జిల్లా తరఫున టి.వేణు గోపాలస్వామి విశ్రాంత ఇన్‌స్పెక్టర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశామన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు విశ్రాంత ఉద్యోగుల సమస్యలు జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో వినిపిస్తామని, నిరంతరం విశ్రాంత పోలీసు అధికారుల సమస్యల సాధనకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు విశ్రాంత ఉద్యోగులు పోలీసు సంఘం అధ్యక్షులు ఎల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ అఫ్జల్, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్ రావ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రభాకర్ రెడ్డి,జీవన్, జహింగీర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక షాబుద్దీన్ జాతర

ఎంపీ సురేష్ షట్కర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

నవతెలంగాణ-జహీరాబాద్



శకాపూర్ గ్రామంలోని హజ్రత్ షేక్ షాబుద్దీన్ తుర్కీ జాతర ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక అని ఎంపీ సురేష్ షట్కార్, ఎమ్మెల్యే మాణిక్యరావులు అన్నారు. మాజీమంత్రి చంద్రశేఖర్, మాజీ టీఎస్ ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్‌లతో కలిసి గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. శఖాపూర్ లాంటి మారుమూల ప్రాంతంలో దేశంలోనే పేరుగాంచి ఖవాలి కళాకారులు కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసి చదర్ సమర్పించారు. అనంతరం ఉర్సు ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఉర్సు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీయేడు ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరపడం.. కుల మతాలకతీతంగా భక్తులు పాల్గొనడం ఆనందదాయకమని కొనియాడారు. తమ ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. దర్గా ప్రాంగణంతోపాటు శకాపూర్ గ్రామ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామన్నారు. ఆ షేక్ షాబోద్దీన్ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ఖీజర్ యెహై, దర్గ కమిటీ నిర్వాహకులు చస్ముద్దీన్‌లు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు జేజే జావీద్ అలీ, కాజా మీయ, మహమ్మద్ జహంగీర్, రాములు నేత, మూ తిరామ్, బిజీ సందీప్, బాల్రెడ్డి, ఉగ్గేల్లి రాములు, మక్సుద్, హర్షద్ అలీ, శాఖీర్ అలీ,పబ్బతి రాకేష్,యుత్ కాంగ్రెస్ ఎన్‌యస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రత్యేక పూజలు..

ఎమ్మెల్యే మాణిక్‌రావు తమ అనుచరులతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చినటువంటి ప్రజలకు అభివాదం చేస్తూ ఖవాలి నిర్వాహకులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్, నాయకులు విజేందర్రెడ్డి, చిన్న రెడ్డి, సైఫొద్దీన్, షాబుద్దీన్, అబుద్ యేహై, లతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి



నవతెలంగాణ-కంది

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) శాఖ మహాసభ మండలంలోని చేర్యాల్ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల గ్రామ శివారులో అనేక పరిశ్రమలు వస్తున్నాయని.. ఏసీ టైర్స్ లాంటి పెద్ద పరిశ్రమలు ఉన్నాయని కానీ స్థానికులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెద్ద ఎత్తున కల్పించడం లేదన్నారు. ఒకవేళ తీసుకున్నప్పటికీ.. రోజువారి కూలీలుగా, కాంటాక్ట్ కార్మికులుగా మాత్రమే తీసుకుంటున్నారన్నారు. పర్మనెంట్ కార్మికుల సంఖ్య నామమాత్రంగానే ఉంటుందని.. పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల ఇక్కడి ప్రజలు భూములు, వనరులు కోల్పోతున్నారన్నారు. స్థానికులకు ఎక్కువ ఉద్యోగాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా.. అమలు జరగడం లేదని, పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేదని, సరైన సౌకర్యాలు ఉండటం లేదని వెంటనే అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కనీస వేతనాలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ పని గంటలు పని చేయించుకుంటున్నారని.. పని గంటల దోపిడీని అరికట్టాలన్నారు. కొన్ని పరిశ్రమలు కాలుష్యం నిబంధనలు పాటించడం లేదని దీంతో కాలుష్యం పెరుగుతుందని, కాలుష్య నివారణకు పరిశ్రమలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు అశోక్, ప్రభాకర్, వెంకట్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంఘం కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-న్యాల్‌కల్



రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో హద్నూర్‌లో రైతు హక్కుల సాధన సంఘం ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజు మాట్లాడుతూ.. రైతుల సమస్యల కోసం సంఘం తోడ్పాటు ఎప్పుడు ఉంటుందన్నారు. రైతుల పక్షాన పోరాటాలకు ఎల్లవేళలా సిద్ధమన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో రైతు సాధన కమిటీ మండల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షులు సురేందర్, కార్యదర్శి గుండారెడ్డి, కోశాధికారి రాహుల్, కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి, రాములు, రవి, బసవరాజ్, సురేందర్, కనకరాజు, జయరాజు, వలియోద్దీన్, జిల్లాకార్యవర్గ సభ్యులు రాజియోద్దిన్, మక్సుదల్ అల్లి, నియోజవర్గ ఇన్చార్జ్ సమియొద్దీన్, షకీల్ తదితరులు ఉన్నారు.

దళితుల ఇండ్ల స్థలాల జోలికొస్తే ఊరుకోం

నవతెలంగాణ-సంగారెడ్డి



దళితుల ఇండ్ల స్థలాల జోలికి వస్తే ఊరుకోబోమని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మాణిక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంగారెడ్డి మండలంలోని గౌడిచర్లలో గత 50 ఏండ్ల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను ఇప్పుడు ఇతరులకు పట్టా చేయడం అన్యాయమని.. దళితుల ఇండ్ల స్థలాలను కాపాడాలని కోరుతూ బాధితులతో కలిసి గ్రామంలోని సర్వే నం 653లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాణిక్ మాటాడుతూ.. గ్రామంలోని సర్వే నెం.653లో 4ఎకరాల 3గుంటల భూమిని 50 ఏండ్ల క్రితం దళితులకు ఇండ్ల స్థలాల కోసం సుమారు 40మందికి ఒక పట్టాదార్ వద్ద రేజూమ్ చేసుకొని ఇచ్చారన్నారు. అదే గ్రామంలోని ఇతర పేదలకు వేరే సర్వే నంబర్‌లో కూడా ఇండ్ల స్థలాలకోసం భూములు ఇచ్చారన్నారు. కానీ దళితులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల జోలికి మాత్రమే పట్టేదార్ వస్తున్నారని.. ఇందులో కొంత భాగం వేరే వాళ్లకు అమ్మడం సరికాదన్నారు. అక్రమంగా భూమి పట్టా రిజిస్టర్ చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. ఇప్పటికే అక్కడ కొంతమంది దళితులు ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని.. కొంతమంది డబ్బులు లేక ఇండ్లు కట్టుకోలేదన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం తరఫున ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త నాగరాజ్, ఇళ్ల స్థలాల బాధితులు రమేష్, సమ్మయ్య, బాలయ్య, రవి, నర్సింలు, శ్రీనివాస్, శోభ, కిష్టయ్య, భాగ్యమ్మ విట్టల్, ప్రసాద్, కిషన్, ప్రవీణ్, బాధిత దళిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి పరామర్శ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్ కుమారుడు చక్రి లివర్ మరియు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దాంతో బాధిత కుటుంబాన్ని మండల నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. వెంటనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో, అంకుర్ హాస్పిటల్ యాజమాన్యంతో చక్రి ఆరోగ్య పరిస్థితి గురించి వివరించారు. అనంతరం టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, సిజిఆర్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు తదితరులు మంత్రి నివాసానికి వెళ్లి.. కలిసి మండల సమస్యలపై మంత్రితో చర్చించారు. వెంటనే మంత్రి స్పందించి.. వంద పడకల ఆసుపత్రి మంజూరు విషయంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి, డిఎంహెచ్ఓ గాయత్రి దేవితో మాట్లాడారని.. నేడు(శనివారం) గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థల పరిశీలన కోసం వెళ్లాలని ఆదేశించారన్నారు. దాంతో వారు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ పరిసర ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ మండలం వ్యవసాయ ఆధారిత కావడం ప్రజలు ఏర్పాటును తిరస్కరించడంతో పూర్తి వివరాలను అడిగి రాష్ట్ర ముఖ్యమంత్రి కి వాస్తవాలను వెల్లడించాలని మంత్రిని కోరారు. తాజా మాజీ సర్పంచ్ లు దోమడుగు శంకర్, గడ్డం హనుమంత రెడ్డి, రవి, శ్రీనివాస్, లింగయ్యగారి నరేందర్ రెడ్డి, శివానందం తదితరులు ఉన్నారు.



'ఖేడ్'ను చెత్తరహిత పట్టణంగా మార్చాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని.. నారాయణఖేడ్‌ను చెత్తరహిత పట్టణంగా మార్చాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ రామ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హిసేవలో భాగంగా శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే తడి, పొడి చెత్త వేరుగా చేసి పురపాలక వాహనాలకు అంది ంచడం పై అవగాహనా కల్పించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆక్సిజన్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి.. పార్క్‌ను శుభ్రం చేయించారు. కాగా కిరాణా షాపులు, పండ్ల, బట్టల దుఖానాతో పాటు అన్నింటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నారాయ ణఖేడ్‌ను చెత్త లేని పట్టణంగా మార్చడానికి పట్టణ ప్రజలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని 12వ వార్డు కౌన్సిలర్ కొరబొయిన నాగరాజు తెలిపారు. పురపాలక సంఘం 12వ వార్డులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మహిళలకు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతీ రోజు చెత్తను తడి, పొడిగా వేరు చేసి మున్సిపల్ చెత్తబండిలో వేయాలని, ప్రతి ఒక్క రూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మహాత్మ గాంధీ అడుగుజాడలో నడవాలని, శుభ్రమైన వాతావరణాన్ని కల్పించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యాన్ని కాపాడుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రంలో కమీషనర్ తిరుపతి, సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్, ఆర్ఐ నారాయణ, మాజీ కౌన్సిలర్ శరత్ బాబు, వార్డు ప్రజలు,వార్డ్ యూత్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహంపై దాడి దుర్మార్గం

నవతెలంగాణ-హత్నూర



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొంతనపల్లి గ్రామంలో గుర్తుతెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహం కుడి చేతి ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని అల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత రత్న సాయమోళ్ల నర్సింగ్ రాజ్ మండిపడ్డారు. గుండ్లవ హాచునూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వతంత్రం వచ్చి నేటికీ 77 ఏండ్లు పూర్తి చేసుకున్నా.. కుల వివక్షత, అంటరానితనం నేటికీ గ్రామాల్లో రాజ్యమేలుతున్నదని మండిపడ్డారు. కులం, మతం, వర్గం ప్రాంతం తేడా లేకుండా భారతీయులందరూ సమానమే అని చాటిచెప్పిన మహనీయుడు.. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి.. మహిళలు కూడా పురుషులతో సమానమే అని చాటి చెప్పిన మహనీ యుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని గుర్తు చేశారు. అలాంటి మహానుభావుడి విగ్రహం కుడి చేతి ని ధ్వంసం చేసిన దుండగలపై వెంటనే రాజద్రోహం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమా ండ్ చేశారు. లేని యెడల దళిత సంఘాలను కూడగట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు, నాయ కులు జంగయ్య, శ్రీకాంత్, మహేష్, నర్సిములు, సాయి లోకేష్, సాయి శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కావలసింది విద్య, వైద్యం

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో శుక్రవారం మండలానికి సంబంధించి 78 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రజలకు కావలసింది విద్య వైద్యం అని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చెయ్యని అభివృద్ధి 8 నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ లో మెడికల్ కాలేజ్ కృషి చేసిందన్నారు. అదేవిధంగా మండలాన్ని అభివృద్ధి పథంలో సేవా కార్యక్రమంలో ముందు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలంటే రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే గెలిపించాలని మండల ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు తన సొంత ఖర్చులతో కంప్యూటర్‌ను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో రాజిరెడ్డి,ఆర్ ఐ గంగాధర్ గౌడ్, రామ్మోహన్ శర్మ,మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, పార్టీ మండల అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జడ్పీ సీఈవో ఎల్లయ్య

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జడ్పీ సీఈఓ సిహెచ్ ఎల్లయ్య, గ్రామంలోని బీసీ కాలనీలో పలు ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని. నీటి నిల్వ ఉన్నట్లయితే డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వారానికి ఒకసారి నీటి తొట్టిలను శుభ్రపరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీఓ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి నర్సింలు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీ కొట్టిన కారు

- అక్కడికక్కడే దుర్మరణం

నవతెలంగాణ-కొల్చారం



ఓ మహిళ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి చౌరస్తాలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, కొల్చారం పోలీసుల కథనం ప్రకారం వివరాలు. పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల దుర్గమ్మ (60) శుక్రవారం మెదక్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి పోతంశెట్టిపల్లికి వచ్చింది. అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి బలంగా ఢీకొట్టడంతో దుర్గమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు, మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతురాలు దుర్గమ్మకు భర్త మల్లయ్య, ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

- మొక్కజొన్న పనులు చేస్తుండగా ఘటన

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



మొక్కజొన్న చేనులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటుతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం గ్యార భూలక్ష్మి (48) కూలీ పనులు చేస్తూ అత్త గండవ్వ, పిల్లలతో కలిసి జీవనం సాగిస్తుంది. అదే గ్రామానికి చెందిన చర్లపల్లి రాజిరెడ్డి మొక్కజొన్న చేనులో ఉదయం 10 గంటలకు ఇద్దరు కూలీలతో కలిసి కంకులు తెంపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైంది. స్థానికులు 108 కి సమాచారం అందించగా వారు వచ్చేలోపే భూలక్ష్మి మృతి చెందినట్లు అంబులెన్సు సిబ్బంది నిర్ధారించారు. మృతిరాలి అత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్ కు రేషన్ డీలరుల సన్మానం

నవతెలంగాణ- రాయపోల్



దౌల్తాబాద్ మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర రావును దౌల్తాబాద్ మండల రేషన్ డీలర్లు శుక్రవారం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల రేషన్ డీలరుల సంఘం అధ్యక్షులు ఎ.లక్ష్మణ్, సభ్యులు వి. మల్లేశం, ఎ. శేఖర్ రెడ్డి, సాయిలు, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ లో జన్మదిన వేడుకలు..

- ఎస్ఐ జన్మదిన వేడుకలు నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకులు

నవతెలంగాణ-బెజ్జంకి



పోలీస్ స్టేషన్ లో రాజకీయ పార్టీల నాయకులు జన్మదిన వేడుకలు నిర్వహించడం పరిపాటిగా మారింది. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చాంబర్ యందు ఎస్ఐ క్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలను మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన అయా రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కేక్ కట్ చేశారు. అయా రాజకీయ పార్టీల నాయకులు ఎస్ఐకి స్వీట్ తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలు నిర్వహించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. పోలీస్ స్టేషన్ ఆవరణంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలిసిన అయా రాజకీయ పార్టీల నాయకులు విస్మరించడం గమనార్హం. జన్మదిన వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకుడిని ఫోన్ ద్వారా వివరణ కోరగా పోలీస్ ఆవరణం బయట ఎస్ఐ జన్మదిన వేడుకలు నిర్వహించామని దాటవేసే ధోరణి అవలంబించాడు. అయా రాజకీయ పార్టీల నాయకులు ఎస్ఐ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించిన తీరుపై సంబధిత జిల్లా పోలీస్ అధికారులు స్పందిస్తారా..? లేకా చూసిచూడనట్టు వ్యవహరిస్తారా వేచి చూడాల్సిందే.

కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు ఒక వరం

- మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్
- మండలంలో 71 లబ్ధిదారులకు చెక్కుల అందజేత

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్




రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డకు ఒక వరమ అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 71 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పంతాలు ముందుకు తీసుకెళ్తారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పరుశు రాం గౌడ్, హవేలీ ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

దాచారంలో కుల దురఅహంకారంతో దళితులపై దాడి

- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..
- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కేల్లి బాలకిషన్ డిమాండ్.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో దళితులపై జరిగిన దాడి అమానుషమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కేల్లి బాలకిషన్ డిమాండ్. శుక్రవారం గజ్వేల్ మండలం దాచారంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో గురువారం జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా కుల అహంకార పెత్తందారులు దళితులను దుర్భాషలాడడం సరికాదన్నారు. మీరు మా కంటే గణేష్ నిమజ్జనం ముందు చేస్తారా? మీరు తక్కువ కులం వారు? అంటూ కించపరిచారు అన్నారు. మాదిగ జాతికి చెందినవారు మేమే మీపై చేయి సాధించాలని అన్నారని గ్రామస్తులు తెలిపారు. దళితులు అనే నెపంతో వారిపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. దాచారం గ్రామంలోని దాడికి గురైన దళితులను కేవీపీఎస్ జిల్లా కమిటీ పరామర్శించడం జరిగిందన్నారు. ఈ సంఘటన కుల అహంకార వ్యక్తులు చేసిన దాడి స్పష్టం చేసిందంటూ కెవిపిఎస్ జిల్లా కమిటీ విచారం వ్యక్తం చేసింది. కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడడం దళితులపై వారికున్నటువంటి చిన్న చూపు వివక్షను తెలియజేస్తుందన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి దాడికి పాల్పడినటువంటి కుల ఉన్మాదుల పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మరాటి కృష్ణమూర్తి,జిల్లా సహాయ కార్యదర్శి దర్శనం రమేష్ , మర్కుక్ మండల అధ్యక్షుడు దాసు, గజ్వేల్ మండల నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



ప్రభుత్వ ఆదేశానుసారం పెండింగ్ ధరణి అర్జీలను స్పెషల్ డ్రైవ్ పద్ధతిలో పరిష్కరించడానికి జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమై యున్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేది నాటికి జిల్లాలో సుమారుగా 10,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చిన దరఖాస్తులను కలిపి మొత్తంగా సుమారుగా 14వేలు దరఖాస్తులు వచ్చాయన్నారు. గడిచిన రెండున్నర నెలల్లో జులై, ఆగస్టు, సెప్టెంబర్ 20వ తేదీ వరకు సుమారుగా 10వేలు దరఖాస్తులు పరిష్కరించబడినవన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా అతి త్వరలో పరిష్కరించడానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నదని, వచ్చే వారం నుంచి ప్రతి సోమవారం అన్ని తహసీల్దారు, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యాల్లో కూడా ప్రజావాణి పెద్ద ఎత్తున నిర్వహించబడుతుంది అని తెలిపారు. ప్రజలందరూ భూమి, ధరణి సమస్యలు ఉంటె సంబంధిత తహసీల్దారు, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణిలో సంప్రదిం చగలని, దరఖాస్తుపై 7 పని దినములలో వ్రాత పూర్వక ముగా మీకు సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు జిల్లా మిషన్ శక్తి అవగాహనా కార్యక్రమం

- పభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభావతి

నవతెలంగాణ-తూప్రాన్



మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభావతి ఆధ్వర్యంలో మహిళలకు జిల్లా మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ జిల్లా మిషన్ శక్తి ద్వారా జిల్లాలోని మహిళలకు, బాలికలకు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు మెదక్ జిల్లా కేంద్రంలోని సాధికారత కేంద్రం భవనంలో నిర్వహించనున్నామన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి, లైంగిక వేధింపులను నిర్మూలించడానికి, మహిళలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించడానికి భరోసా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారన్నారు. తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే బాలికలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రతిభ, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ

నవతెలంగాణ-వెల్దుర్తి



ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమి, సిక్కం భూమి, స్మశాన వాటిక భూమి, కొందరి చేతుల్లో అక్రమంగా కబ్జాకు గురైందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ నరేందర్ మాట్లాడుతూ మండలాల్లోని ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాబ్ గురైందని అన్నారు. మండల్ లేవల్ అధికారులు ఆర్ఐతో ఎంక్వైరీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అన్నారు. మండల పరిధి బండ పోసాని పల్లి గ్రామంలోని స్మశాన స్థలం కబ్జా చేస్తారని మరోసారి గుర్తు చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోపోలేదన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులో సర్వే నెంబర్ 149 గోదల మంద అని పిలవపడే ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారని అన్నారు. ఆ యొక్క భూమి గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడేది అన్నారు. కబ్జాదారుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

రక్షణ కవచమైన ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత

- వైస్ ప్రిన్సిపాల్ సింహా రెడ్డి

నవతెలంగాణ-మెదక్ టౌన్



జీవ జాతులకు రక్షణ కవచమైన ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.సింహా రెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ప్రపంచ ఓజోన్ దినోత్సవం" సందర్భంగా ఓజోన్ పరిరక్షణపై అవగాహన కలిగించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అభివృద్ధి నిరంతరం జరిగే క్రమంలో ప్రకృతి మీద తాము పడుతున్న ఒత్తిడిని గుర్తు చేశారు. మనం విడుదల చేసే అనేక రకాల కాలుష్యకారకాలు, ముఖ్యంగా వాయు కాలుష్యముతో, ఓజోన్ పొర తగ్గిపోతుందని, దీని ఫలితంగా సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై చేరి జీవజాతులపై అనేక రుగ్మతలను తెచ్చిపెడుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ఓజోన్ పొర పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత కలిగి ఉన్నామని, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా మాత్రమే ఈ కవచాన్ని రక్షించవచ్చని సూచించారు. అదే విధంగా, రసాయన శాస్త్ర విభాగాధిపతి నరేందర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విద్యార్థులు వివిధ పద్ధతులపై అవగాహన పొందేందుకు "పోస్టర్ ప్రెజెంటేషన్" పోటీ నిర్వహించారు. ఇందులో డాక్టర్ నాగేందర్ రావు, డాక్టర్ విశ్వనాథం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఉత్తమ పోస్టర్ ప్రదర్శించిన విద్యార్థులకు తరువాతి కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు రసాయన శాస్త్ర విభాగాధిపతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం నుంచి డాక్టర్ రమణ కుమార్, వేణుగోపాల్ రావు, వృక్షశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ శ్రీలత, మురళి, డాక్టర్ రాజు, వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి

నవతెలంగాణ-పాపన్నపేట



చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు. గ్రామానికి చెందిన నాయికోటి కేశయ్య(58) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్ళాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటమినిగిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సాయంతో చెరువులో గాలింపు చేపట్టగా మృతదే హం లభ్యమైంది. మృతదేహా న్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు భిక్షపతి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు

నవతెలంగాణ-సిద్దిపేట



ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఒక వెండి, కాంస్య పతకం సాధించారని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాఘవపూర్ కు చెందిన గ్యార లీలా ఆనంద్ డేకథ్లాన్‌లో వెండి పతకం, టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ కొండపాక చెందిన నగేష్ అండర్-18 జవలియన్ త్రో కాంస్య పతకం సాధించారని తెలిపారు. వీరిని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, రెజ్లింగ్ జిల్లా అధ్యక్షులు ఏర్వ అశోక్, తదితరులు అభినందించారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో జీవించాలి

- అక్కన్నపేట ఏఎస్ఐ రామ్మూర్తి.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవాపూర్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి ఏఎస్ఐ రామ్మూర్తి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో జీవించాలని అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకొస్తుందని, ఇందులో షీ టీమ్స్ బాగా పనిచేస్తున్నాయని తెలియజేశారు. అంతేకాకుండా అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని అన్నారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే, భవిష్యత్ అంత బాగుంటుందన్నారు. చదువుకునే టైంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా ఎదగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, మహిళా కానిస్టేబుల్స్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్ల కృష్ణ, శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజపాల్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, పాల్గొన్నారు.



మండల సమైక్య కార్యాలయంలో 16వ సర్వసభ్య సమావేశం

- ముఖ్యఅతిథి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల కేంద్రంలో మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం 16వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి. మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశం ఉద్దేశించి మాట్లాడారు. అన్ని గ్రామ సంఘాలు సభ్య సంఘాల సభ్యులు ఆర్థిక ప్రగతిలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 130 శాతం బ్యాంకు లింకేజీ బ్యాంకు లింకేజ్ ఎన్‌పిఏ 0.5శాతం ఉండాలని చెప్పారు. ప్రతి మహిళ కనీసం రూ.10వేలు నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వచ్చేలా సుస్థిర జీవనోపాదులు కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. సామాజిక ప్రగతిలో భాగంగా నా బాధ్యత అనే నినాదంతో మండలంలో 9260 మంది సభ్యులు తలా ఒక మొక్క నాటి మూడేళ్ల వరకు కాపాడాలని అన్నారు. ఈ సమావేశంలో ఆదాయ, వ్యాయాలు, మహిళా శక్తి ప్రోగ్రాం డైరీ బ్యాంక్ యార్డ్ పౌల్ట్రీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ అంశాలు చేర్చారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత ఏపీఎం శంకరయ్య, సీసీలు, సోషల్ యాక్షన్ కమిటీ మెంబర్ ముక్తాబై అన్ని గ్రామ సంఘాల ఆఫీసు బేరర్స్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించండి

నవతెలంగాణ-మెదక్ టౌన్



అటవీ పునర్నిర్మాణం, నిర్మాణం, జీవవైవిద్యం, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రము, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో తయారు చేసిన విత్తనబంతులని స్థానిక పాతూరు వద్ద గల అటవీ ప్రాంతంలో వృక్షశాస్త్ర అధ్యయన విద్యార్థులు వెదజల్లారు. విత్తన బంతులను నల్ల రేగడి మట్టితో తయారు చేయడం వలన వీటిపై ఎటువంటి కీటకాలు, ఉడతలు, ఎలుకలు, చీమలు, ఇతర జంతువులు ఈ విత్తనాలను తినకుండ కాపాడబడటమె కాకుండ, ఈ బంతులలోని మృతిక సారాన్ని వినియోగించుకోవడం ద్వారా సారవంతం లేని నేలలో కూడా మొక్కలు పెరగడానికి అనుకూలంగా ఉంటుందని, వర్షం పడే వరకు రక్షణ పొంది, వర్షం పడిన వెంటనే మొలకెత్తుతాయని, తద్వార కొత్తగా మొక్కలు ఏర్పడటమె కాకుండ, అటవీ విస్తరణ పెరగడం ద్వారా పర్యావరణ సమతుల్యతను ప్రోత్సహించవచ్చనివృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె నాగేందర్ రావు తెలియజేశారు. ఈ విత్తన బంతులతో స్థానికంగా పెరిగే కానుగ, ఇప్ప, చింత, వేప గింజలను ఉపయోగించడం వలన సహజసిద్ధంగా స్థానిక మొక్కలతో పాటు సులభంగా పెరుగుతాయని, ఈ వృక్ష సంపద పెరగడం వలన నేలను స్థిరీకరణ చేసి నేల కోతను తగ్గిస్తుందని, దీని వలన స్థానిక వన్యప్రాణులకు ఆహారం, ఆశ్రయాన్ని అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎకొ క్లబ్ కోఆర్డినేటర్ మురళీ వరెల్లి వృక్షశాస్త్ర విభాగాచార్యులు డాక్టర్ ఆర్ శ్రీలత, డాక్టర్ బి రాజు, లాబ్ ఇంచార్జ్ సుధారాణి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

27న మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-మెదక్ టౌన్

సెప్టెంబర్ 27న మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రసాయన శాస్త్రమును ఆప్షనల్ సబ్జెక్టుగా చదివిన పీజీ, డిగ్రీ, ఇంటర్ లేదా మైక్రో బయాలజీ లో పీజీ చేసిన అభ్యర్థుల కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా అభ్యర్థులకు ప్రముఖ ఔషధ (ఫార్మసిటికల్) సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. కెమిస్ట్రీని ఆప్షనల్ సబ్జెక్టుగా చదివిన అభ్యర్థులకు ఈ జాబ్ మేళా మంచి అవకాశమని, ప్రొడక్షన్, స్టోర్ విభాగాల్లో అప్రెంటిస్ ట్రైనీలుగా ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే ఔషధ సంస్థలు, రసాయన పరిశ్రమలో ప్రఖ్యాతి గాంచిన సంస్థలుగా ఉండటం విశేషం ప్రొడక్షన్, స్టోర్ (వేర్ హౌసింగ్) విభాగాలలో ఉద్యోగాలు అందించబడతాయని తెలిపారు. అభ్యర్థులు 28ఏళ్లలోపు కలిగి ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూలో పాల్గొనదలచిన అభ్యర్థులు, క్రింది క్యూఆర్ కోడ్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 27న డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు, తమ రెజ్యూమ్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని హాజరుకావాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే డాక్టర్ ఎస్. తిరుమల్ రెడ్డి 7382929698 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మెదక్, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇది కెమిస్ట్రీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి గొప్ప అవకాశం అని ప్రిన్సిపల్ డాక్టర్ కే హుస్సేన్ కోరారు.

మిత్రుని జ్ఞాపకార్థంగా విద్యార్థులకు బుక్స్, ప్లేట్లు పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గ్రామానికి చెందిన రెడ్డి కరుణాకర్, గత 15 రోజుల క్రితం మరణించడం జరిగింది. కరుణాకర్ జ్ఞాపకార్థంగా 2014 -15 బ్యాచ్ తోటి స్నేహితులు హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్స్, బుక్స్,పెన్స్, అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి స్నేహితుడు కర్ణాకర్ మరణ వార్త జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. అతని ఆత్మ శాంతి కోసం ఐదు నిమిషాలు మౌనం పాటించి జ్ఞాపకార్థంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు లేట్స్, బుక్స్, అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, వేణుగోపాల్, లింగం, రామ్మోహన్ శర్మ, తొటి స్నేహితులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, పేదింటి ఆడబిడ్డలకు ఒక వరం

- 116 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ-మెదక్ టౌన్



పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి ఒక వరం అని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణం, మెదక్ మండలంకు సంబందించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంబంధించి మొత్తంగా 116 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మెదక్ పట్టణంలోని ద్వారకా గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెం దిన గెరిగంటి కుమార్ (24) గత రెండు రోజుల క్రితం మరణించాడు. ఇట్టి విషయా న్ని తెలుసుకున్న బీజేపీ పార్టీ నాయకులు గ్రామస్తుడు చల్మేటి నరేందర్ మృతుని కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5వేలు నగదు, 50 కిలో బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్ధరాంరెడ్డి, జీపి స్వామి, గెరిగంటి బాబు,తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-మెదక్ టౌన్



దంత సమస్యలున్న వారికి రామయంపేట వైబి డెంటల్ హస్పిటల్, లయన్స్ క్లబ్ రామయంపేట ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం మెదక్ మండల పరిధిలోని మాచవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సతీష్, డాక్టర్ మనోజ్ఞల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుల సలహా మేరకు జాగ్రత్తలు పాటిస్తే దంతాలు దృఢంగా ఉంటాయని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నీలకంఠ, లయన్స్ అధ్యక్షులు పవన్ కుమార్, కార్యదర్శులు కిషన్, జనార్దన్ రెడ్డి, రంజిత్ గోనెల్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-మర్కుక్

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పాలన సాగించడం ఇబ్బందిగా మారుతుందని వచ్చే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీవో అఫ్జలుద్దీన్ ,ఎంపీవో రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నామని రాష్ట్రంలో ఏ ఉద్యోగి అయిన తన జీతం ఇంటి ఖర్చులకు ఖర్చుపెడతాడు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉద్యోగులు తమ జీవితాలను గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్నారని మండల అభివృద్ధి అధికారులు మా ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విద్యా వికాస్ రెడ్డి, నరేందర్, శాంతి, సిద్దేశ్వర్, తదితరులున్నారు.

పాల పదార్థాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటలో కల్తీ పాలు విచ్చలవిడిగా అమ్ముతున్నారని, మున్సిపల్ అధికారులు పాల పదార్థాలపై దృష్టి సారించాలని, తనిఖీలు చేయాలని సిద్దిపేట వినియోగదారుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో సత్యనారాయణ మాట్లాడుతూ తాను గంగాపూర్ లింగం అనే వ్యక్తి వద్ద పాలు కొంటున్నానని, వాటిని పెరుగుగా తోడు పెట్టుకుంటున్నానని, కానీ రెండు రోజుల కింద పెరుగును చూస్తే నారలుగా సాగుతుందని, అందులో కెమికల్స్ కలిపినట్లు తనకు అనుమానం ఉందని, మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారుల కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన శాంపిల్స్ ను వారికి అందించనున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందుకే, రోజు ఉపయోగించే పాలు, పెరుగులపై విరివిగా తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బత్తుల నారాయణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేట

జవహర్ నవోదయ కళాశాల సహాయ సహకారంతో, ఐఐటీ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత మెటీరియల్స్ అందిస్తున్నట్లు సెంటర్ నిర్వాహకులు రామయ్య తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ ఉచిత మెటీరియల్ ను సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఉన్న తులిప్స్ పాఠశాలలో శనివారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో 6 వ తరగతిలో అడ్మిషన్‌కు ప్రవేశ పరీక్ష వ్రాయడానికి అర్హులనీ, ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025 న జరుగుననీ, ఈ ఎంట్రెన్స్ కు ఉచితంగా అప్లికేషన్ చేయబడుననీ, ఇందుకు ఆధార్ కార్డు జిరాక్స్, 5 వ తరగతి చదువుతున్న పాఠశాల యొక్క ప్రధానోపాధ్యాయుడుచే స్టడీ బోనా ఫైడ్ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, విద్యార్థి సంతకం, తండ్రి సంతకం లు అవసరమని, వీటితో మీకు ఉచితంగా అప్లికేషన్ చేయబడుననీ తెలిపారు. అప్లికేషన్ కు చివరి తేది 23 సెప్టెంబర్ 2024తో ముగుస్తుంది అని తెలిపారు.

గజ్వేల్ వాసుకి డాక్టరేట్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణం చెందిన గంగాల నరేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పట్టా పొందారు. డాక్టర్ బి ఇంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ సీబీఐకి ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంశంలో అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఎయిర్ పొల్యూషన్ మానిటరింగ్ అండ్ డేటా ఎనాలసిస్ పరిశోధన గాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్డీ డాక్టర్ పట్టాను పొందారు. దీంతో గజ్వేల్ తాలూకా పరిధిలోని పలువురు గంగాల నరేష్‌ను అభినందిస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పీజీటీ సివిక్స్, టీజీటీ ఇంగ్లీష్, బోధించేందుకు రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ కె. శకుంతల శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీటీ సివిక్స్, టీజీటీ ఇంగ్లీష్, ఉపాధ్యాయ పోస్టులు అవర్ లీ బేసిక్ కింద తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. పీజీటీ సివిక్స్‌కు ఎంఏ బీఈడీ ఉండాలని, టీజీటీ ఇంగ్లీష్ కు డిగ్రీ బీఈడీ చదివి ఉండాలని తెలిపారు. ఈ రెండు పోస్టులకు ఈనెల 21వ తేదీలోపు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గజ్వేల్‌లో శునకాలను పట్టివేత



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో శుక్రవారం మున్సిపల్ అధికారులు మున్సిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో శునకాలను పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శునకాల బెడద తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంతాన నివారణకు చర్యలులో భాగంగా శునకాలకు ఇంజక్షన్ అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. పలు వార్డులో శునకాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మద్దూరు, రేబర్తి గ్రామాల్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని రేబర్తి, మద్దూరు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గద్ద వెంకటేశ్వర్లు, మాధవ్ జాదవ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో డ్రై డే సందర్భంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు. పిచ్చి మొక్కలు మొలకెత్తకుండా, మురుగు నీరు వద్ద దోమలు వృద్ధి చెందకుండా దోమల మందును గడ్డి మందులను పిచికారి చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, సీఏలు, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లు చంద్రమౌళి, తండ్రి బొల్లు ఎల్లయ్య, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుని కుటుంబాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, శుక్రవారం పరామర్శించారు. బొల్లు ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతను కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు బద్దిపడగ కృష్ణారెడ్డి, కర్ణాకర్, బీఆర్ఎస్ పార్టీ మద్దూరు, దూళ్మిట్ట, మండల అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి డీసీసీబీ డైరెక్టర్ ఆర్థిక సాయం



నవతెలంగాణ -ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన గంగలబోయిన నరసయ్య గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి శుక్రవారం ఉదయం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ హరిబాబు, ములుగు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విలసాగర్ బాలరాజ్, మాజీ వార్డ్ మెంబర్లు శ్రీనివాస్, నగేష్, బీఆర్ఎస్ నాయకులు , పాల్గొన్నారు

రాజకీయంగా మరింత ఎదగాలి

- ఘనంగా మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్ జన్మదిన వేడుకలు
- మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్

నవతెలంగాణ-గజ్వేల్



రాజకీయంగా మరింత ఎదగాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ జన్మదిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన భాస్కర్ రానున్న కాలంలో మరింత రాజకీయంగాఎదగాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. గతంలో మున్సిపల్ చైర్మెన్ గా పనిచేసిన అనుభవంతో గజ్వేల్ అభివృద్ధిలో ప్రధాన పాత్ర దారిగా కావాలని ఆయన అన్నారు. డీసీసీ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో సమిష్టిగా పని చేద్దామని ఆయన చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గాడి పల్లి భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, లక్ష్మారెడ్డి, అజ్జర్, భాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజారామ్, నాగరాజు ఆధ్వర్యంలో భాస్కర్ ను ఘనంగా సన్మానించారు.

ఇందిర జలప్రభ పై ఎస్సీ, ఎస్టీలకు చిగురిస్తున్న ఆశలు





నవతెలంగాణ-గజ్వేల్

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిర జల ప్రభ పథకాన్ని తీసుకురానున్నట్లు ఇటీవల డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేసిన ప్రకటన ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఆశలు నింపిందని చెప్పాలి. పథకం పకడ్బందీగా అమలు చేయాలని మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వం తిరిగి ఇందిర జల ప్రభను తీసుకురావాలని చూస్తున్నామని ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ఆర్ ప్రభుత్వ హాయంలో ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసినట్లు చెప్పుకొచ్చారు.

ఇందిర జల ప్రభ పై ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు ఆశలు మళ్లీ చిగురుస్తున్నాయి. 2014 ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఈ పథకాన్ని అమలు చేశారు. అప్పుడున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పథకం గజ్వేల్, సిద్దిపేట, సంగారెడ్డి, నారాయణఖేడ్, రామాయంపేట, మెదక్ ప్రాంతంలో ఈ పథకం ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ కుటుంబాల్లో కొంత దోహత పడ్డది. గజ్వేల్ శాసనసభ్యులుగా ఇక్కడ మంత్రిగా పనిచేసిన డాక్టర్ గీతారెడ్డి ఈ పథకాన్ని అమలు కోసం కృషి చేశారు. ఎస్సీ, ఎస్టీల బీడు భూములను సస్యశ్యామలం చేసి వారి జీవితాల్లో వెలుగు నింపడానికి 2005లో 'ఇందిర ప్రభ' పేరిట వైఎస్ రాజశేఖరెడ్డి ఈ పథ కాన్ని తీసుకొచ్చారు. ప్రధానంగా అసైన్డ్ భూములు లేదా దళితుల పట్టా భూములను ఈ పథకం కింద అభివృద్ధి చేసేవారు. సుమారు 10 నుంచి 20 ఎకరాలను యూనిట్గా తీసుకొని పది మందికిపై ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులను గ్రూపుగా ఏర్పాటుచేసి, వారి భూముల్లో బోరుబావులు వేయించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవారు. పథకం 2009 వరకు బాగానే నడిచింది. వైఎస్ మరణం తర్వాత 2011లో అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఈ పథకాన్ని 'ఇందిర జలప్రభ' గా మార్చారు. కానీ పథకం నిర్వహణ సక్రమంగా సాగ లేదు. చివరి దశలో ఆర్డీఎఫ్(రూరల్ ఇంటిగ్రేటెడ్ - డెవలప్మెంట్ ఫండ్) 14 కింద ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆందోల్, గజ్వేల్, మెదక్, నారాయణఖేడ్, నర్సాపూర్, రామాయంపేట, సిద్దిపేట, జహీరాబాద్ క్లస్టర్ల పరిధిలో 54,105 ఎకరాలను సాగులోకి తీసు కురావడమే లక్ష్యంగా 5,082 బోరుబావులను తవ్వించాలని అందుకోసం రూ.58.27కోట్లకుపైగా నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ నిధుల ద్వారా అప్పట్లో 3,333 బోరుబావులు మాత్రమే వేసి తద్వారా 35,496 ఎకరాలను మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు. మరో 10,214 ఎకరాల అభివృద్ధి చేయలేకపోయారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో

ఆయా భూముల్లో 973కు పైగా బోరుబావులు వెయ్యవలసి ఉండగా అది పెండింగ్లో పడ్డది. అప్పట్లో అధికారులు ప్రకటించిన 25శాతం పైగా బోరు బావుల్లో మోటర్లు అమర్చిన వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేకపోయారు. మరికొన్నిటికీ విద్యుత్ సరఫరా ఇచ్చిన మోటార్లను బిగించలేదు. పథకం నివేదికల ప్రకారం ఆయా క్లస్టర్ల పరిధిలో ఇంకా 360 బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు పెండింగ్లో ఉన్నాయి. నిధుల కొరతను సాకుగా చూపి పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుపై మరింత నిర్లక్ష్యం చేసింది. ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామంటూ బీఆర్ఎస్ ప్రకటించినా పెద్దగా అమలు చేయలేదు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇందిర జల ప్రభ పథకంపై దృష్టి పెట్టి ఫైల్లు కదిలించేలా చేస్తుంది. ఇందుకు

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రకటన కొంత ఎస్సీ, ఎస్టీల్లో వర్గాల్లో ఊరట కలిగిస్తుంది.

-ఇందిర జల ప్రభ పథకాన్ని అమలు చేయాలి



ఇందిర జల ప్రభ పథకాన్ని అమలు చేయాలి. ఎస్సీ ఎస్టీలకు బీడు భూములు సాగుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. 2014 ముందు ఈ పథకం కొంత ఎస్సీ ఎస్టీల్లో ఊరట ఇచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పథకాన్ని తీసుకురావాలి. ఎస్సీ ఎస్టీ వర్గాలను సామాజిక ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఈ పథకం దోహదపడుతుంది.

-డీబీఎఫ్ నాయకులు ఏగొండ స్వామి

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలి

- పర్మినెంట్ చేసేలోపు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలి
- సిద్దిపేట మున్సిపల్‌లోని డైలీ వైజ్ కార్మికులకు 60వ జీఓ ప్రకార వేతనాలు ఇవ్వాలి
- రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి, చొప్పరి రవి డిమాండ్





నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, అదేవిధంగా సిద్దిపేట మున్సిపల్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే డైలివేజ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్న సిబ్బంది పర్మినెంట్, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ప్రభుత్వ సంక్షేమాలు, కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పర రవికుమార్ డిమాండ్ చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీలో కార్మికులతో కలిసి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మున్సిపల్ ఆర్వోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి, రవికుమార్‌లు మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీలో దాదాపు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమంది కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్నగా వీరికి ప్రకారం 60జీవో ప్రకారం కేటగిరి వారిగా రూ.16,500, రూ.19500, రూ.21500 ఇస్తున్నారు. కానీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సింది పోయి దీంతో శ్రమదే ఎప్పుడు ఇందులో కూడా 80 మంది కార్మికులు డైలీ వైజ్ కింద తీసుకొని వారికి కేవలం రూ..12 వేలు నిర్ణయించి వాటిని కూడా అమలు చేయడం కావున వీరందరినీ పర్మినెంట్ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లోపు కనీసం కుటుంబం బ్రతకడానికి రూ.26 వేలు అందరికీ ఇవ్వాలని కోరారు. రాత్రిపూట పనులు చేసే సమయంలో అతివేగంగా వచ్చే వాహనాల క్రింద పడి అనేక మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అటువంటి వారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదు. మున్సిపల్ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు గా నిర్ణయించాలని, మున్సిపల్ కార్మికులకు 8 గంటలు పని దినాలను అమలు చేయాలని, ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.26 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలి. కావున తమరు జోక్యం చేసుకొని కార్మికులందరి పర్మినెంట్, రూ.26వేలు కనీస వేతనాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి మార్గం చూపగలరని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొబ్బెట రాజయ్య, గుర్రం నర్సింలు, వినోద, బాల్ నర్సు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీ యూ ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ జి నర్సయ్యకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ కనీస వేతనం రూ.26 వేలకు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రోజువారి వేతనం కార్మికులను గ్రూపులో ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ. 25 లక్షలు కల్పించాలని, మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని , డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కుమార్, సంతోష్, వెంకటేష్ ,యాదగిరి, నర్సింలు, లక్ష్మీ, యాదమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవపట్టించే రాజకీయ నాయకుల మాటలు నమ్మొద్దు

- ఇచ్చిన హామీలు నేరవెర్చే కాంగ్రెస్ పార్టీనే
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఏలూరి కమలాకర్
- పోతారెడ్డి పేటలో లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకం పత్రాలు పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, గత ప్రభుత్వంలాగా ఇచ్చిన వాగ్దానలను, హామీలను మరిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదని, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొంతమంది రాజకీయ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మొద్దని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఏలూరి కమలాకర్ సూచించారు. శుక్రవారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శి హరీష్‌తో కలిసి "మహాలక్ష్మి పథకం" ద్వారా మంజురైనా రూ. 500 గ్యాస్ సిలిండర్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల లబ్ధిదారుల పేర్లు రాకపోయి ఉంటే మా దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన అందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే మాట మీద నిలబడే ప్రభుత్వమని గత ప్రభుత్వాలలాగా ఓటు బ్యాంకు పథకాలు అమలు చేయదని స్పష్టం చేశారు. చారిత్రాత్మకమైన పథకాలు కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అందుకు ఉదాహరణే కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పథకమని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాదగని వెంకట్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బ్యాగారి నవీన్, మాష్టి సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణరావుపేట మండల జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల పాఠశాల బాలికలు పాల్గొన్నారు. అండర్14 అండర్ 17 కోకో కబడ్డీ వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు విద్యార్థుల శారీరక మానసిక పెరుగుదలకు దోహదం చేస్తాయని అదేవిధంగా గెలుపు ఓటమిలు సహజమని గెలిచిన వారి సంతోషపడిన ఓడిన వారు ఓటమిని గెలుపుగా మార్చుకోవాలని క్రీడా విద్యార్థులను ప్రోత్సహించారు. వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మెన్ వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆటలతో పాటు చదువులో కూడా రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలోమండల విద్యాధికారి యాదవ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్డేపల్లి నాగరాజు , ఎస్‌జీఎఫ్ నారాయణరావుపేట్ మండల సెక్రెటరీ తోట సతీష్ , వివిధ పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

విద్యార్థులు బాల్యంలో విద్యతో పాటు ఆటలు కూడా అవసరమని ఆటలతో శారీరక మానసిక ఆరోగ్యం లభిస్తుందని మర్కుక్ ఎస్ఐ దామోదర్ అన్నారు. మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్‌తో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని అందుకు ఉపాధ్యాయుల తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమన్నారు. వ్యాయామం లేకపోతే మానసిక ఉల్లాసం శారీరక సమతుల్యత లోపిస్తుందన్నారు. ఉత్తమ క్రీడాకారులుగా రాణించి రాష్ట్ర జాతీయ స్థాయిలో గెలుపొందాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని జిల్లాలో 59 మంది పీఈటీలు, పీడీలుగా పదోన్నతి పొందారని వారంతా మరింత ఉత్సాహంతో పనిచేస్తూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ భాస్కర్,దాత మీసేవ నిర్వాహకులు సతీష్ క్రీడలకు సహకార అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారులను పరిచయం చేసి క్రీడలు ప్రారంభించారు. ముందుగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అచ్చం గారి భాస్కర్, పీఆర్టీయూ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి కుమార్ , గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, ఆర్డీవో సదానందం



నవతెలంగాణ-మిరుదొడ్డి

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, ఆర్డీవో సదానందం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట- భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వాలీబాల్, కొక్కో ,కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య, సదానందం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగంలో నిర్వహించిన క్రీడల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చాటి చెప్పారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, వివిధ పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా స్వచ్ఛతాహి సేవలో పాల్గొంటున్న ప్రజలు

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

స్వచ్ఛందంగా స్వచ్ఛతాహి సేవలో ప్రజలు పాల్గొంటున్నారని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సానిటరీ ఇన్స్పెక్టర్, సిబ్బందితో కలిసి ఆయన గాంధీ పార్క్‌లో పిచ్చి గడ్డి తొలగించి, వాటర్ ఫౌంటెన్ శుభ్రం చేయటం జరిగింది. గాంధీ పార్క్‌లో మొలచిన పిచ్చి మొక్కలను తొలగించి, పార్క్ గడ్డిలో ఉన్న పిచ్చి గడ్డిని గ్రాస్ కట్టర్ మిషన్ సహాయం ద్వారా తొలగించారు. పార్క్‌లో ఉన్న మొక్కలకు, చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. సిద్దిపేట పట్టణ ప్రజలు సైతం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలలో పాల్గొంటున్నారని, ఇటీవల ఇందిరమ్మ కాలనీలో ట్రాన్స్ జెండర్లు, గాడిచెర్లపల్లి ప్రజలు, కళాశాలలో విద్యార్థులు సిబ్బంది, ఈరోజు వాకార్స్ అసోసియేషన్ సభ్యులు ఇలా అందరూ స్వచ్ఛందంగా స్వచ్ఛతాహి సేవలో పాల్గొనటాన్ని కమిషనర్ అభినందించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా పట్టణంలోని 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పిచ్చి గడ్డి, చెత్త తొలగింపు చేసి, మొక్కలకు నీరు పట్టడం జరిగింది. అనంతరం వారిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేపించడం జరిగింది. ఎల్లెంకి కళాశాల వద్ద సిబ్బంది మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధుల గురించి ఫ్రీ స్క్రీనింగ్ అవగాహన క్యాంపు




నవతెలంగాణ-నంగునూరు

ప్రపంచ మహిళల గర్భాశయ, అండాశయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సురభి మల్టి స్పెషాలిటీ హాస్పిటల్, సురభిమెడికల్ కళాశాల (మిట్టపల్లి)లో గర్భాశయ, అండాశయ క్యాన్సర్ వ్యాధుల గురించి ఫ్రీ స్క్రీనింగ్ అవగాహన క్యాంపు నిర్వహించారు. సురభి మల్టి స్పెషాలిటీ హాస్పిటల్‌లో గర్భాశయ అండాశయ క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి దాదాపు 180 మంది నుంచి 200 మందికి ఉచితంగాఎండో మెంట్రల్ బయాప్సీ, పాప్స్ మియర్, స్కానింగ్‌లు రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ క్యాంపుని ఉద్దేశించి సురభి హాస్పిటల్ గైనకలజీ డిపార్ట్మెంట్ డాక్టర్స్ మాట్లాడుతూ సర్వికలై క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వారా గర్భసంచి టీకాలు తీసుకొని సర్వైకల్ నివారించ వచ్చని, 9 ఏళ్ల పై బడిన వారు మహిళలు టీకాలు తీసుకోవచ్చని తెలిపారు. అలాగే క్యాన్సర్‌కి సంబంధించిన స్కానింగ్ పరీక్షలను ఎప్పటికీ అప్పుడు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ కి సంబంధించిన లక్షణాల గురించి, క్యాన్సర్ నీ అరికట్ట దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సురభి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాం ప్రసాద్, సూపరింటెండెంట్ శివరామ చారి, గైనకాలజీ డిపార్ట్మెంట్ హెచ్ఓడీ తొగరికర్, ప్రొఫెసర్ మంజు కుమారి, సీనియర్ గైనకాలజిస్ట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- సుమారు రూ.70 వేలు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని దొంగలు





నవతెలంగాణ -నంగునూరు

వేసిన తాళం వేసినట్లే ఉండగా, తలుపుకు ఉన్నా గొల్లాన్ని రాడుతో వంచి దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలో గురువారం రాత్రి సమయంలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం. నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామానికి చెందిన సామల సుధాకర్ భార్య అనారోగ్యంతో బాధపడుతూ తన పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్యను చూసేందుకు బాధితుడు సుధాకర్ తన అత్తగారింటికి గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్ళాడు. శుక్రవారం ఉదయం సుధాకర్ తన ఇంటికి వచ్చేసరికి వేసిన తాళం వేసినట్లే ఉండగా, తలుపుకు ఉన్నా గొల్లాన్ని రాడుతో వంచి సుమారు రూ.70 వేలు నగదును అపహరించినట్లు గమనించాడు. ఇంట్లో దొంగలు పడ్డారనే విషయాన్ని స్థానిక రాజగోపాల్ పేట పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు, క్ల్యూస్ టీం తో కలిసి వివరాలను సేకరించారు. ఈ విషయమై బాధితుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్ పేట పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారు

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు ఇపుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో నిర్ణయం తీసుకొని, విద్య, వైద్యం, యువతకు, వ్యవసాయ రంగాలకు న్యాయం చేస్తున్నారని, జాబ్ క్యాలెండర్ ప్రకారం నిరుద్యోగులకు వైద్య ఆరోగ్య శాఖ లో4 వేల నూతన కొలువులు విడుదల చేశారని అన్నారు. యువత కు నైపుణ్యాలు నేర్పిచి, ఉపాధి కల్పించే లక్ష్యం తో తెలంగాణ యాంగ్ ఇండియా స్కిల్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వరద బాధితులకు ప్రజా ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తున్నారని అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా ట్రాన్స్ జెండర్ల సంక్షేమ కోసంకృషి చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షల కోట్లు ప్రాజెక్టుల పెర దోపిడీ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ కలిమోద్దీన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీమ్, పాల్గొన్నారు.

కేసీఆర్ ముందు చూపుతో ప్రాజెక్టుల నిర్మాణం

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే రైతు సంక్షేమానికి ప్రాజెక్టులు నిర్మించినట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శుక్రవారం మల్లన్న సాగర్ ప్రాజెక్టు సందర్శించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఇక్కడ ప్రాంతంలో గతంలో ఎలాంటి ప్రాజెక్టు లేక రైతులు సాగునీటికి ఇబ్బంది పడే వారిని దాని దృష్టిలో పెట్టుకొని 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టులు నిర్మించేందుకు కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. 70 ఏళ్లల్లో అనేక ప్రభుత్వాలు పరిపాలించిన ఇక్కడ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించలేకపోయినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు తెలంగాణను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన చెందారు. రాష్ట్ర ఏర్పడిన తర్వాత గజ్వేల్ ప్రాంతంలో కేసీఆర్ మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మించి రైతులకు సాగునీరందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్స్ నిర్మాణానికి స్థల సేకరణ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల పరిధిలో 133కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం గౌరవెల్లి ప్రాజెక్టు దగ్గరలోని ప్రభుత్వ భూమిని టెక్నికల్ కన్స్ట్రక్షన్ డీఈ శ్రీనాథ్, కన్స్ట్రక్షన్ ఏడీ కృష్ణమోహన్, సివిల్ ఏడీ సుకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్యలు ఎమ్మార్వో అనంతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ..మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కన్నపేట మండలాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎన్నో అభివృద్ధి పనులను తీసుకొస్తున్నారని అన్నారు. దానిలో భాగంగానే అక్కన్నపేట మండలానికి 133కేవీ, 33కేవీ సబ్ స్టేషన్లు రెండు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సబ్ స్టేషన్స్ నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ఉద్దేశంతో అధికారులు స్థల సేకరణ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మల్లంపల్లి, రేగొండ గ్రామంలో 33కేవీ సబ్ స్టేషన్స్ నిర్మాణానికి స్థల సేకరణ జరిగిందని తెలియజేశారు. 133కేవీ కోసం గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో స్థలాన్ని పరిశీలించారని అన్నారు. అనంతరం ఎమ్మార్వో అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూమికి సంబంధించి పూర్తిస్థాయిలో సర్వే చేసి స్థలాన్ని విద్యుత్ అధికారులకు అందజేస్తామని అన్నారు. కొంతమంది ప్రభుత్వ భూమిని, కబ్జా చేశారని, దానిపై పూర్తిస్థాయిలో సర్వే చేసి, అట్టి భూమిని మళ్లీ రికవరీ చేస్తామని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవెల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకట్ల కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆర్ఐ యాదగిరి, తదితరులు, పాల్గొన్నారు.

మాదిగ మాల ఉప కులాలకు రిజర్వేషన్ పెంచాలి

- తెలంగాణ దళిత పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సందీప్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

మాదిగ మాల ఉపకులాలకు రిజర్వేషన్ పెంచాలని తెలంగాణ దళిత పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సందీప్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షునిగా పెరుమా శివకుమార్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న దళితులందరికీ రిజర్వేషన్ పెంచాలని మాదిగ, మాల ఉపకులాలకు రిజర్వేషన్ పెంచి అమలు చేయాలని ఈ దిశగా తెలంగాణ దళిత పరిరక్షణ సమితి కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి సంపత్ సందీప్ తెలిపారు. అనంతరం మండల అధ్యక్షునిగా నియమితులైన పెరమని శివకుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సిద్దిపేట రూరల్ మండలం అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నక్క విజయ్ కుమార్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ పెరిక కిషోర్,ఏల వంశీ, కొమ్ము మనోహర్, శీలం అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ లో తడి పొడి చెత్త పై అవగాహన



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా 18 వ, 7 వ వార్డులలో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ ఇంటిలోని చెత్తను తడి చెత్త పొడి చెత్త, హానికరమైన చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వాడకూడదని, ప్లాస్టిక్ వాడడం వల్ల భూ కాలుష్యం పెరిగి పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు. పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ,రిజల్ట్ శాతాన్ని పెంచాలి

- రాష్ట్రంలో సిద్దిపేటను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి
- డీఐఈఓ రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

ఇంటర్మీడియట్ లో క్రమంగా విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను, రిజల్ట్ శాతాన్ని పెంచాలని, వచ్చే ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కళాశాల అధ్యాపక బృందం కృషి చేయాలని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ రవీందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల తరగతి గదుల్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. డీఐఈఓ రవీందర్ రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపక బృందం శాలువాతో సన్మానించారు.

విద్య తో పాటు క్రీడారంగంలో రాణించాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

విద్యార్థులు విద్యతోపాటు క్రీడరంగంలో రాణించాలని హుస్నాబాద్ మున్సిపల్ చెర్మెన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ లో మండల స్థాయి అండర్ 14క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ విద్యార్థులందరూ తమకు ఇష్టమైన ఆటపాటల్లో పాల్గొనాలని, ఆటలు శారీరక మానసికంగా దృఢంగా ఉండటానికి దోహదపడుతాయన్నారు. ఉన్నత చదువుల్లో కూడా ఆటపాటలతో అనుకున్నది సాధించడానికి ఉపయోగపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మెన్, దొడ్డి శ్రీనివాస్ కౌన్సిలర్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న ,యండి హసన్, ఎంఈఓ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

గంటల ప్రాతిపదికన బోధనకు దరఖాస్తులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో గంటల ప్రాతిపదికన పాఠ్యాంశాల బోధనకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శుక్రవారం ప్రధానాచార్యుల ఖలీధ శీరీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, భౌతికశాస్త్రం విభాగంలో పీజీ విద్యార్హత కలిగి బీఎడ్, టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 23 వరకు స్థానిక ఆదర్శ విద్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఖలీధ శీరీన్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టీఎస్36టీఏ4959 నెంబర్ గల లారీని ఎస్సై అభిలాష్ శుక్రవారం పట్టుకున్నారు. అయన తెలిపిన వివరాల ప్రకారం శనిగరం పరిధిలోని శంకర్ నగర్ నుంచి హైదరాబాద్ కు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నరని సమాచారం రావడంతో గ్రామ శివారులో ఆగి ఉన్న ఇసుక లారీ ని పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి లారీ ని పోలీస్ స్టేషన్ కు తరలించారు.అదేవిధంగా అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక




నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని వడ్లూర్ బేగంపేట గ్రామానికి చెందిన జనగాం సాయి చరణ్, కొరివి అభిషేక్,(ప్రభుత్వ జూనియర్ కళాశాల బెజ్జంకి), ఎగోళం నిహారిక (మహిళా పాలిటెక్నిక్ కళాశాల సిద్దిపేట) ఇటీవల జిల్లాలో నిర్వహించిన జూనియర్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి శుక్రవారం 10వ రాష్ట్రస్థాయి జూనియర్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు

కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మానసికస్థితి సరిగాలేదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి





నవతెలంగాణ - కొమురవెల్లి

కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మానసిక స్థితి బాగాలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాటాడుతూ.. కొమ్మూరి ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని సొంత పార్టీ కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారని, అతడిని హైదరాబాదులోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చూపించాలని అన్నారు. ఇటీవల జనగామ జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉత్సవ కమిటీ కార్యక్రమం, చేర్యాల మార్కెట్ కమిటీ ప్రమాణ శ్రీకారం కార్యక్రమాలలో పాల్గొన్నారన్నారు. ఓడిపోయిన తరువాత ప్రజలను ఓట్లేయలేదని అనడం సరికాదని అన్నారు. గతంలో చేర్యాల జేఏసీలో ఉన్న కొమ్మూరి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెవెన్యూ డివిజన్, కోర్టు ఏర్పాటు విషయాలపై నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలకు కొమ్మూరి అండగా ఉండాల్సింది పోయి అభివృద్ధిని అడ్డుకుంటు న్నాడని తీవ్రంగా మండిపడ్డారు. ఈ ప్రాంతంలో అనేక భూములు కొనుగోలు చేశాడని అందులో ఫామ్ హౌస్ లు కట్టాడని వాటిపై విచారణ చేయాలన్నాడు. ఆయన మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేర్యాలలో ఏడెకరాల ఒక గుంట భూదాన భూమి ఆక్రమించాడని, కాలువ భూమిలో ఇల్లు నిర్మాణం చేసిండని విటన్నిటి పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు . ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, మండల నాయకులు, పాల్గొన్నారు.

పోషక అనుబంధం కార్యక్రమం పై సీడీపీఓ, వైద్యశాఖ సూపర్వైజర్లకు అవగాహన





నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమ శాఖ సమన్వయంతో జిల్లాలోని వైద్యాధికారులకు సీడీపీఓ లకు వైద్యశాఖ సూపర్వైజర్స్‌కు సంక్షేమ శాఖ సూపర్వైజర్స్ కు పర్యవేక్షక అనుబంధ పోషకాహార కార్యక్రమం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ నరసింహారావు జూమ్ ద్వారా పాల్గొంటూ ఎస్ఎస్‌పి ప్రోగ్రాం పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గైడ్లెన్స్ ప్రకారము ఎస్ ఏ ఎం, ఎంఏఎం, ఎంయు డబ్ల్యూ, ఎస్ యుడబ్ల్య పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 0-59 నెల ఎస్ ఏ ఎం, ఎంయుడబ్ల్యూ, ఎస్‌యుడబ్ల్యూ బరువును ఇంప్రూవ్ చేసి ఆరోగ్యవంతమైన పిల్లలుగా తయారు చేయడం అన్నారు. మొదట పిల్లలు యొక్క పిల్లల యొక్క గ్రోత్ మానిటరింగ్ చేసి ఎస్ఏఎం, ఎంఏఎం, ఏఎంయు డబ్ల్యూ, ఎస్యూడబ్ల్యూ పిల్లలను గుర్తించి, ఎస్ ఏ ఎం వారికి ఆకలి పరీక్ష నిర్వహించి ఫెయిల్ అయిన వారిని వైద్య చికిత్స కై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వద్దకు పంపించాలి అని తెలిపారు. వైద్యాధికారి పరీక్షించిన తర్వాత వారి ఆరోగ్యాన్ని పోషక స్థాయిని పరీక్షించి ఎన్ఆర్‌సికి పంపించడం లేదా మందుల చికిత్సలు చికిత్సను అందించడం జరుగుతుంది. అనుబంధ పోషకాహారంలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత పైన కూడా గర్భిణీలకు ,తల్లులకు, కుటుంబాలకు అవగాహన కలిగించడం ద్వారా , ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు గృహ సందర్శనలు నిర్వహిస్తూ తల్లులకు అవగాహన కలిగిస్తూ కౌన్సెలింగ్ చేస్తూ పిల్లల యొక్క పోషక స్థాయిలను పెంచేందుకు సూచనలు అందించి 0- 59 నెలల పిల్లల యొక్క పిల్లల యొక్క ఆరోగ్యాన్ని మెరుగుప రిచేందుక కృషి చేస్తారని తెలిపారు . జిల్లా కలెక్టర్ మన చౌదరి పాల్గొని మాట్లాడుతూ రెండు డిపార్ట్మెంట్ల సమన్వయంతో ప్రతి పిల్లవాని ఆరోగ్యాన్ని సమీక్షిస్తూ మెరుగుపరిచేందుకు కృషి చేయాలని, వైద్యాధికారులు ప్రతి పిల్లవాణ్ణి తక్షణమే పరీక్షించి చికిత్స అందజేయాలని ఆదేశించారు. వైద్యాధికారి రెఫర్ చేయబడిన పిల్లల్ని అంగన్వాడీ ఆశా కార్యకర్తల సమన్వయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల ఎన్ఆర్‌సిలో అడ్మిట్ చేసి చికిత్స అందేటట్లు చూడాలని ,డిశ్చార్జి తర్వాత కూడా 8 వారాల వరకు ఫాలో అప్ నిర్వహించాలని , తదనంతరము ఎన్ హెచ్ టి ఎస్ పోర్టల్ లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. తదనంతరము న్యూట్రిషన్ ఛాంపియన్ పోస్టర్లను, టెలి మానస్ టోల్ ఫ్రీ నెంబర్ బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.హెచ్.ఎన్ , సిహెచ్.శారద డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌సిడి డాక్టర్ నారాయణ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రేవతి, డాక్టర్ రజని, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఆర్‌సి ఐసిడిఎస్ శాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మహిళల హక్కుల సాధన, రక్షణ కోసం ఐద్వా పోరాటం

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత
- దుబ్బాకలో ఘనంగా ఐద్వా మండల ద్వితీయ మహాసభ



నవతెలంగాణ- దుబ్బాక

మహిళల హక్కుల సాధన వారి రక్షణకై ఐద్వా పోరాటం చేస్తుందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో జీ.మానస అధ్యక్షతన నిర్వహించిన "అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) దుబ్బాక మండల ద్వితీయ మహాసభ" కు ముఖ్యతిథులుగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.ఎస్.ఆశాలత హాజరై మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజురోజుకు దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని దీనికి కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. ప్రతీ 72 నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అన్ని వర్గాల మహిళలు చైతన్య దిక్సూచిగా ఐద్వా మార్గంలో ముందుకు సాగాలని అన్నారు.అన్ని వర్గాల మహిళలకు బాసటగా నిలిచి, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, మహిళా హక్కురక్షణ కోసం నడుం బిగించి పోరాటాలు ఉధృతంగా నిర్వహిస్తున్న సంఘం "ఐద్వా" అని నొక్కి చెప్పారు. కేంద్రంలో అధికారం ఉన్న మోడీ ప్రభుత్వం భేటీ బచావో ,బేటి పడావో అంటూ నినాదాల కే పరిమితంగా ఉన్నదని విమర్శించారు. ప్రతి మహిళ పురుషులకి బానిసలుగా, వంటింటికే పరిమితం కావాలని ప్రస్తుత పాలకవర్గాలు కోరుతున్నాయని.. అలాంటి వారిపై అన్ని వర్గాల మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో పేదరికం,నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని ఈ ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు ,ఉద్యోగులకు సామాజిక భద్రత కరువైందని మహిళల హక్కులు పూర్తిగా హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కూడా గతంలో మహిళలపై జరిగిన దాడుల ఘటనల విషయాల్లో జోక్యం చేసుకొని ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించిన చరిత్ర సంఘానికి ఉందని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఈ ప్రాంతంలో మహిళల రక్షణ, హక్కుల కొరకు పోరాడుతుందని సంఘాన్ని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, వివిధ గ్రామాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి





నవతెలంగాణ- రాయపోల్

గ్రామపంచాయతీలలో నిధులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కనీస సౌకర్యాలు కూడా గ్రామ ప్రజలకు కల్పించాలేని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారని పంచాయతీ కార్యదర్శుల యూనియన్ మండల అధ్యక్షులు శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది నెలల నుంచి గ్రామాలలో పరిపాలన పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు నిర్వహించడం జరుగుతుందని. కానీ గ్రామ పంచాయతీలలో నిధులు లేక సమస్యలు పేరుకుపో తున్నాయని పంచాయతీ కార్యదర్శులు సొంత నిధులు కేటాయించి గ్రామాల్లో పనులు చేయిస్తున్నారు. వేతనం గ్రామ పనులకు కేటాయించడం వలన కుటుంబ పోషణకు డబ్బులు లేక ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు త్వరలో రాబోతున్నాయని గ్రామాలలో ఆ పండుగలకి ఏర్పాట్లు చేయాలంటే గ్రామపంచాయతీలో నిధులు లేవు. కాబట్టి పంచాయతీ కార్యదర్శులకే పెను భారమవుతుందన్నారు. కొన్ని గ్రామాలలో కార్మికులకు వేతనాలు చెల్లించాలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య పనులు కొనసాగించలేని స్థితిలో గ్రామపంచాయతీలు ఉన్నాయని నిత్యం చెత్త సేకరణ చేయడానికి ట్రాక్టర్ డీజిల్ కి కూడా నిధులు లేక ఇబ్బందులు అవుతు న్నాయన్నారు. ఇలాంటి సమస్యలతో పంచాయతీ కార్యద ర్శులు సతమ తమవుతు న్నారని వెంటనే జిల్లా అధికారులకు ప్రభుత్వ దృష్టికి మా సమస్యలను పరిష్కరించాలని గ్రామప ంచాయతీ లకు నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పరమేష్, విజయ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామాల్లో పంచాయతీ పనులకు జీతం డబ్బులు పెట్టి ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ జీతం డబ్బులతో పనులు చేస్తే మా కుటుంబం ఎలా గడుస్తుందని అన్నారు. గ్రామపంచాయతీల్లో నిధుల కోరుతూ తీర్చాలని పేర్కొన్నారు. పండుగల నేపథ్యం లో కార్యదర్శుల పై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఖర్చు పెట్టిన ఐఎఫ్ఎంఎస్ నిధులు పది నెలలుగా రాలేదన్నారు. గ్రామపంచాయతీ లకు అవసరమైన సామాగ్రి ఉద్దేర ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడమే కాంగ్రెస్ నైజం

- మాటలకు ఎక్కువ చేతలు తక్కువ
- మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ- దుబ్బాక

అలవి కాని అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని, ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ సర్కార్ నైజమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కార్ పాలనలో మాటలకు ఎక్కువ చేతలకు తక్కువ అని ఎద్దేవా చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కత్తి కార్తీకగౌడ్ మాజీ మంత్రి హరీశ్ రావు,ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లను శాలువాలు కప్పి సత్కరించారు. ఆ తర్వాత కార్తీక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ పేద గర్భిణీలకు అందిస్తున్న "మా ఇంటి మహాలక్ష్మి" అన్న ప్రత్యేక న్యూట్రీషన్ కిట్లతో కూడిన కానుకలను దుబ్బాక మండలంలోని 16 మంది గర్భిణీలకు హరీశ్ రావు చేతులమీదుగా అందజేశారు. గర్భిణీ స్త్రీల కోసం న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న కత్తి కార్తీక గౌడ్‌ను అభినందించారు. అనంతరం వారు మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ఇలాగే గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లను, డెలివరీ అనంతరం కేసీఆర్ కిట్లను అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ నేడు ఆ కిట్లను విస్మరించి ందన్నారు. కొత్తజంటలకురూ 1 లక్ష ,తులం బంగారం, రూ.7500- రైతు భరోసా, రూ.4000- పెన్షన్, మహిళలకు -రూ.2500, విద్యార్థులకు భరోసా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మోటార్లు కాలిపోతున్నాయని, కరెంటు కోతలు అధికమైనట్లు ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, న్యూట్రిషన్ కిట్లను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారివెంట మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, కౌన్సిలర్లు పల్లె మీనా రామస్వామి గౌడ్, ఇల్లందుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్, మాజీ జెడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం కుల గణన చేసి బీసీలకు న్యాయం చేయాలి

- జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేయాలనీ, ఫీజుల బకాయిలు చెల్లించాలనీ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్ అన్నారు. పంచాయితీ రాజ్ , సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42 శాతం కు పెంచాలని, గత మూడేళ్ల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయము ముందు శుక్రవారం ధర్నా చేశారు. నరేంద్ర మోడీ బీసీ అయి ఉండి కుల గనన చేయకపోవడం చాలా బాధాకరం ఇప్పటికైనా కళ్ళు తెరిచి బీసీ కులగణనా చేపట్టాలని కొమ్ము ఉమేష్ యాదవ్ బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల వాగ్దానంప్రకారం బీసీ రిజర్వేషన్లను 42శాతంకు పెంచడం లేదు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయిత్ రాజ్ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతంనకు పెంచాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బీసీల కు వెంటనే బీసీ కులగణ జరిగేలా గా చూడాలని కోరుకుంటున్నాము అన్నారు. సుప్రీంకోర్ట్ తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు అన్నారు. 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగా సవరణ చేయరా..? ప్రశ్నించారు. విద్యా,ఉద్యోగ,రాజకీయ రిజర్వేషన్లు పెంచుతా మని బడ్జెట్ కేటాయిస్తామని అంటున్నారు. కాని రాష్ట్రంలో బీసీలకు అన్యాయం సిగ్గుచేటు అన్నారు. గత మూడేళ్ల ఫీజుల బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చేయకపోతే కులగణన ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర 50 వేల మందితో ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపతి, పాల్గొన్నారు

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం

- మండల విద్యాశాఖ అధికారి నర్సమ్మ
- ఆటలు ఆరోగ్యానికి మేలు





నవతెలంగాణ- రాయపోల్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణిస్తే జీవితంలో అనతి కాలంలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి బండి నర్సమ్మ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీర దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే వారి జీవితంలో నాయకత్వ లక్షణాలతో పాటు అనతికాలంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఆస్కారం ఉంటుందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు మొదటి రోజు వాలీబాల్, ఖో- ఖో క్రీడా పోటీలు వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో అనాజీపూర్, రాయపోల్, రామారం, వడ్డేపల్లి బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కేజీబీవీ రాయపోల్ విద్యార్థులు అండర్ -14, అండర్ -17 విభాగాలలో బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. రెండవ రోజు శనివారం మిగతా పోటీలు నిర్వహించబడతాయి అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఏ. సత్యనారాయణ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు నాగరాజు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల క్రీడా సమాఖ్య పోటీలను శుక్రవారం ఫిజికల్ డైరెక్టర్ జంగపెల్లి వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 14-17 ఏండ్ల మధ్య ఉండే బాల, బాలికలు పాల్గొని ఖోఖోలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని అన్నారు. క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలియజేశారు. అలాగే శనివారం కబడ్డీ పోటీలు యధావిధిగా ఉంటాయని, క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు మైదానానికి చేరుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ గుగులోతు రంగా, ఎంపీడీవో జయరాం, గౌరవెల్లి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ రేణుక శ్రీనివాస్, కార్యదర్శి నిర్మల, గ్రామస్తులు ,వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కుటుంబంలో కలహాలతో తల్లికూతురు ఆత్మహత్య

- బావిలో దూకి అఘాయిత్యం
- మహిళ మృతదేహం లభ్యం
- బాలిక మృతదేహం కోసం తీవ్రంగా శ్రమించిన గజఈతగాల్లు





నవతెలంగాణ-బెజ్జంకి

కుటుంబంలో కలహాలు తలెత్తి మనస్తాపంతో తల్లికూతురు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. జనాగం జిల్లాకు తరిగొప్పుల గ్రామానికి చెందిన సాంబారి రాజేశ్వర్ స్థానిక పెట్రోల్ బంకులో పని చేస్తూ భార్య శారధ (35), కూతురు స్పందన(14), కుమారుడు రఘువరన్(09)తో కలిసి మండల కేంద్రంలో అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబంలో కలహాలు తలెత్తాయి. మనస్తాపానికి గురైన మహిళ తన కూతురు, కుమారుడుతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యయత్నాకి పాల్పడడానికి వెళ్లింది. తల్లికూతురు ఇద్దరు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుమారుడు ఇంటి వద్దకు పరుగెత్తుకు వచ్చి చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. చుట్టుపక్కల వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టి మహిళ మృతదేహన్ని వెలికితీశారు. బాలిక మృతదేహం కోసం తీవ్ర గాలింపు చేపట్టిన లభ్యమవ్వలేదు. ఇతర ప్రాంతం నుంచి వచ్చిన గజ ఈతగాల్ల సహాయంతో ఎట్టకేలకు బాలిక మృతదేహం వెలితీశారు. పోస్ట్ మార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాసపత్రికి తరంచారు. మృతురాలి తల్లి వడ్లాల రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

చాకచక్యంగా వ్యవహరించిన బాలుడు

శుక్రవారం సుమారు వేకువజాము సుమారు 3 గం. సమయంలో కూతురు, కుమారుడితో కలిసి మహిళ ఆత్మహత్యయత్నానికి బావి వద్దకు వెళ్లింది. తల్లికూతురు బావిలో దూకి ఆత్మహత్యయత్నాకి పాల్పడ్డారు. గమనించిన మృతురాలి కుమారుడు సుమారు 1.5 కి.మీ దూరంలో నివాసముంటున్న ఇంటి వద్దకు చీకటిలో పరుగెత్తుకు వచ్చి చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. చిన్న వయసులో బాలుడు చాకచక్యంగా వ్యవహరించిన తీరును పలువురు అభినందిస్తూనే బాలిక మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు.